



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 235 | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | పేజీలు : 10 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కాలుష్య కారకులే ఎక్కువ భారాన్ని మోయాలి

**- మ్యునిచ్ భద్రతా సమావేశంలో నిర్మలా సీతారామన్**



మ్యునిచ్ - సూర్య వాస్తవం

కాలుష్యానికి ఎవరు కారకులో వారే మెజారిటీ భారాన్ని మోయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వాతావరణ మార్పులపై అంతర్జాతీయంగా చేపట్టాల్సిన కార్యాచరణకు సంబంధించి దేశాల మధ్య విభిన్నమైన రీతిలో బాధ్యతల విభజన వుండాలని ఆమె అన్నారు. కాలుష్యం ఎవరైతే సృష్టిస్తారో వారే చెల్లించాలనే సూత్రాన్ని ఇక్కడ

- మిగతా 2లో..

## ఇదొక ఉచ్చు!

**- దేశ వస్త్ర పరిశ్రమ నాశనానికి నాంది :**
**- అమెరికాతో వాణిజ్య ప్పందంపై రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఇటీవల కుదిరిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల దేశంలో వస్త్ర పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని, నిర్మూలించబడుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ ఒప్పందం ఒక 'ఉచ్చు' అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాహుల్ వీడియో స్టేట్‌మెంట్‌ను శనివారం విడుదల చేశారు. జాతీయ ప్రయోజనాల కోసం పనిచేసే 'దార్శనికత కలిగిన ప్రభుత్వం' అయితే పత్తి రైతులు, ఎగుమతిదారుల ప్రయో జనాలు కాపాడేందుకు, వారి సంక్షేమానికి హామీ కల్పించేలా ఒప్పందం కుదుర్చుకోవాలని అన్నారు. అందుకు పూర్తి విరుద్ధమైన పద్ధతిలో, పత్తి, వస్త్ర రంగాలకు తీవ్రంగా నష్టం వాటిల్లేలా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు.


బంగ్లాదేశ్‌పై 'జీరో శాతం', భారత్‌పై 18శాతం టారిఫ్‌తో ఈ పరిశ్రమ వల్ల ఉపాధి పొందే ఐదు కోట్ల కుటుంబాలు దెబ్బ తింటాయన్నారు.

- మిగతా 2లో..



## మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థుల ఓటమి

- మున్సిపల్ ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసినా
- ఓడిపోయిన మేయర్, చైర్మన్ అభ్యర్థులు
- నిజామాబాద్‌లో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నేతకు పరాజయం
- ఓటుకు వేలల్లో నగదు, బంగారం పంపిణీ చేసినా తిరస్కరించిన ఓటర్లు
- సొంత పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషణ
- డబ్బు పంపిణీ కన్నా స్థానిక నాయకత్వానికే ఓటర్లు ప్రాధాన్యం





హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాజకీయాల్లో డబ్బుదే కీలకపాత్ర అన్న నానుడిని తలకిందులు చేస్తూ తాజాగా జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పలు ఆసక్తికర దృశ్యాలను ఆవిష్కరించాయి. మేయర్, చైర్మన్ పీఠాలపై కన్నేసి, కోట్ల రూపాయలు ఖర్చు చేసినా.. కనీసం సొంత వార్డులో కూడా గెలవలేక పలువురు ఉద్దండ నేతలు చతికిలపడ్డారు. పార్టీలకు మెజారిటీ స్థానాలు దక్కినా, కీలక అభ్యర్థులు ఓడిపోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఓటములకు నిజామాబాద్

- మిగతా 2లో..

## 'హంగ్'లపై రాజకీయం

- పీఠాలను దక్కించుకునేందుకు పార్టీల వ్యూహాలు
- 36 మున్సిపాల్టీల్లో మెజారిటీ పీఠాలపై కాంగ్రెస్ దృష్టి
- నిజామాబాద్‌లో మద్దతిస్తే బోధన్ చైర్మన్ సీటు ఆశిస్తున్న 'పతంగి' పార్టీ
- మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్
- మేయర్ రేసు నుంచి తప్పుకున్న బీజేపీ
- కరీంనగర్‌పైనా అధికార పార్టీ కన్ను
- అన్ని మున్సిపల్స్ నుంచి క్యాంప్‌నకు తరలిన 'విజేతలు'



హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాష్ట్రంలో జరిగిన 116 మున్సిపల్, ఏడు మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌పార్టీ 66 మున్సిపాల్టీలను, నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లను కైవసం చేసుకుంది. 13 మున్సిపాల్టీలను బీఆర్ఎస్ దక్కించుకుంది. ఇంకా 36 మున్సిపాల్టీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో పాలకవర్గం ఏర్పడేందుకు కావాల్సిన మెజార్టీ స్థానాలు దక్కలేదు. హంగ్ ఏర్పడింది. ఇందులో కొన్ని ఇతర పార్టీలు, స్వతంత్రుల మద్దతుతో దక్కించుకునే మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉండగా, ఎక్స్ అఫిషియో సభ్యులతో బయటపడే మున్సిపాలిటీలు మరికొన్ని ఉన్నాయి. హంగ్ ఏర్పడిన 36 మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల చుట్టూ రాజకీయం నడుస్తోంది. వ్యూహాలు, ప్రతి వ్యూహాలు రచిస్తున్నాయి. అభ్యర్థులతో బేరాసారాలు సాగిస్తున్నాయి. పదవుల పేరిట మచ్చికం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. 36 మున్సిపాల్టీల్లో మెజార్టీ మున్సిపాల్టీలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేస్తోంది. కొన్ని మున్సిపాల్టీలను దక్కించుకునేందుకు బీఆర్ఎస్ కూడా తీవ్రంగానే కష్టపడుతోంది. అదేవిధంగా మిగిలిన మూడు కార్పొరేషన్లను తమ ఖాతాల్లో వేసుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ గట్టిగానే ప్రయత్నం చేస్తోంది. ఉమ్మడి వరంగల్

- మిగతా 2లో..

## బడ్జెట్ అంతా అభూత కల్పనలు

**- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

అమరావతి- సూర్య వాస్తవం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొత్త సీసాలో పాత నీరు అన్న చందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బడ్జెట్ అంతా ఉహాజనితం, అభూత కల్పనలేనని ఆమె శనివారం

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఊహాల ఊయల

- రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్‌తో అంకెల గారడి
- వస్తాయో రావో తెలియని కేంద్ర నిధులు, అప్పులే ఆధారం
- అభివృద్ధి బాధ్యత ప్రైవేటుకు ... భారాల భయం సామాన్యుడికి
- కేంద్రానికి పొగడ్తలు ... కీలక రంగాలకు కోతలు
- ఈ సారీ కనిపించని నిరుద్యోగ భృతి... మహిళలకు రు.1,500



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అంకెలతో గారడి చేశారు. శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజలను ఊహల ఊయలలో ఊపే ప్రయత్నం చేశారు. 3.32 లక్షల కోట్ల రూపాయలతో 2026-27 సంవత్సరపు బడ్జెట్ అంకెల్లో మాత్రమే భారీగా కనిపిస్తుంది. వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదు. ఆచరణలో ప్రతి రూపాయి కోసం వస్తాయో రావో తెలియని కేంద్ర నిధుల పైన, షరతులతో విత్త సంస్థలు విదిల్చే అప్పులపైన ఆధారపడక తప్పనిస్థితి ఏర్పడింది. ఫలితంగా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంపై బడ్జెట్ ప్రసంగంలో ఎన్ని మాటలు చెప్పినప్పటికీ, ఊహాలకే అవి పరిమితమయ్యే ప్రమాదం కనపడుతోంది. కేంద్ర ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తిన ఆర్థికమంత్రి, ప్రపంచవ్యాప్తంగా పిపిపి ట్రెండ్ నడుస్తోందంటూ అభివృద్ధి బాధ్యతను ప్రైవేటు రంగంపై నెట్టివేసే ప్రయత్నం చేశారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు కూడా ఆ రంగంవైపే ప్రభుత్వం చూసింది. మరోవైపు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి రంగాలకు చేసిన కేటాయింపులు అంకెల్లో ఘనంగా కనిపిస్తున్నప్పటికీ మొత్తం బడ్జెట్‌లో వాటి వాటాలు తగ్గాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలు, పిఆర్‌సి ప్రకటన వంటివాటి

- మిగతా 2లో..



## ఏపీ వ్యవసాయ బడ్జెట్ రూ.53,752 కోట్లు

- ధాన్యం సేకరణకు సంబంధించి రూ.1,674 కోట్ల బకాయిలు చెల్లింపు.
- పెట్టుబడి రాయితీ కింద రూ.310 కోట్లు కేటాయింపు.
- వ్యవసాయ యాంత్రీకరణలో 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు.
- భూసారాన్ని అంచనా వేయడానికి 6 లక్షల భూసార పరీక్ష పత్రాల అందజేత. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు.
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

అమరావతి - సూర్య వాస్తవం

పోలవరం ప్రాజెక్టు విషయంలో పెండింగ్ లో ఉన్న బకాయిలు చెల్లించామన్నారు మంత్రి. అలాగే డయాఫ్రం వాల్ నిర్మాణం ఇప్పటికే 91 శాతం

- మిగతా 2లో..

## కాలుష్య కారకులే ఎక్కువ భారాన్ని మోయాలి

(మొదటిపేజీ తరువాయి)

అనుసరించాలన్నారు. మ్యునిచ్‌లో శనివారం జరిగిన 'వాతావరణ భద్రత' సమావేశంలో ఆమె ప్రసంగించారు. తీవ్ర స్థాయిలో కాలుష్య కారకాలకు కారణమయ్యే దేశాలు ఈ వాతావరణ మార్పుల వల్ల కలిగే ఆందోళనలను పరిష్కరించడానికి ముందుకు రావాలని, ఆ భారంలో మెజారిటీ వాటాను భరించాలని కోరారు. కాలుష్య సంక్షోభానికి పెద్దగా కారణమవని దేశాలు కూడా సమానంగానే మూల్యం చెల్లించాలని కోరడం సరికాదన్నారు. సాంకేతిక సహకారం కూడా వుండాలన్నారు. వాతావరణ సంబంధిత సాంకేతికతలను వాణిజ్య ప్రాతిపదికన పంచుకోవాలని అభివృద్ధి చెందిన దేశాలను ఆమె కోరారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్ వాతావరణ సంబంధిత కార్యకలాపాలపై ఖర్చు ఎక్కువగా పెడుతోందని చెప్పారు. బయట నుండి వచ్చే నిధుల కోసమో లేదా సాంకేతికత కోసమే వేచిచూడడం లేదన్నారు. ఒకవేళ అలాంటి సహకారం వుంటే స్వాగతిస్తామన్నారు. వాతావరణ మార్పుల వల్ల తలెత్తే ఆందోళనలను పరిష్కరించని పక్షంలో పెద్దసంఖ్యలో ప్రజలను, ప్రాంతాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సత్వరమే కమ్యూనిటీలను, జీవనోపాధులను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని ఆమె చెప్పారు. ఈ ఏడాది తమ బడ్జెట్‌లో పర్యావరణ కేటాయింపులు పెంచామన్నారు.

## ఇదొక ఉచ్చు!

(మొదటిపేజీ తరువాయి)

ఈ రంగంలో భారత్‌కు గట్టి పోటీదారు బంగ్లాదేశేనని అన్నారు. "అమెరికాతో కుదుర్చుకున్న ఈ వాణిజ్య ఒప్పందం వస్త్ర రంగాన్ని సమూలంగా నిర్మూలిస్తుంది. యావత్ దేశానికి ఇది తెలుసు. అలాగే నరేంద్ర మోడీకి కూడా తెలుసు. బంగ్లాదేశ్‌కు ఫ్రీ పాస్ – – జీరో శాతం పన్ను లభించిందని, భారత్‌కు 18శాతం పన్ను వేశారని పార్లమెంట్‌లో కూడా వివరించాను. బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ.. భారత్ వస్త్ర పరిశ్రమను అంతం చేస్తుంది." అని రాహుల్ గాంధీ ఆ ప్రకటనలో వివరించారు.

భారత్, అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై రాహుల్ లోక్‌సభలో ఈ అంశాన్నే ప్రధానంగా ప్రస్తావిస్తూ పలుమార్లు విమర్శలు చేశారు. దానిపై వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ ఎలాంటి ఒప్పందమైతే కుదుర్చుకుందో అదే రీతిలో భారత్ కూడా కుదుర్చుకుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్‌కు అమెరికా ఇచ్చిన ప్రత్యేక రాయితీ గురించి తాను పార్లమెంట్‌లో ప్రశ్నించగా, కేంద్ర మంత్రి ఒకరు బదులిస్తూ, అమెరికా నుంచి పత్తిని మనం దిగుమతి చేసుకుంటే అదే ప్రయోజనాన్ని మనం కూడా పొందగలమని చెప్పారని రాహుల్ శనివారం నాటి వీడియో స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. 'ఈ వాస్తవాన్ని దేశ ప్రజలకు తెలియనివ్వకుండా ఎందుకు దాచారు?' అని రాహుల్ ప్రశ్నించారు. భారత్ విధానం ఒక ఉచ్చు వంటిదని వ్యాఖ్యానించారు. "అమెరికన్ పత్తిని గనుక మనం దిగుమతి చేసుకుంటే మన సొంత రైతులే నాశనమవుతారు. ఒకవేళ మనం దిగుమతి చేసుకోకపోతే మన వస్త్ర పరిశ్రమ వెనుకబడిపోతుంది, నాశనమవుతుంది." అని వివరించారు. భారత్ నుంచి పత్తిని దిగుమతి చేసుకోవడం తగ్గించవచ్చు లేదా నిలుపుచేయవచ్చనే సంకేతాలను బంగ్లాదేశ్ కూడా ఇస్తోందని రాహుల్ తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థుల ఓటమి

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ ఎన్నిక నిలువుటద్దం పట్టింది. కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న కాటిపల్లి శమంత రెడ్డి, 19వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికలకు ముందు రూ. 8 కోట్ల పన్ను బకాయిలు చెల్లించడంతో పాటు, ప్రచారం కోసం దాదాపు రూ. 20 కోట్లు ఖర్చు చేశారనే వార్తలు వచ్చినా ఫలితం దక్కలేదు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్, శంకరపల్లి వంటి చోట్ల పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఓ అభ్యర్థి ఓటుకు రూ. 25 వేల నగదుతో పాటు గ్రాము బంగారం పంపిణీ చేసినా ఓటర్లు కనికరించలేదు. కొన్నిచోట్ల ఓటుకు రూ. 35 వేలు ఇచ్చినా అభ్యర్థులకు పరాజయమే ఎదురైంది. ఆర్మూర్, కామారెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లోనూ ఛైర్మన్ అభ్యర్థులుగా బరిలోకి దిగిన వారు సొంత వార్డుల్లోనే ఓడిపోయారు. ఈ ఫలితాలపై రాజకీయ విశ్లేషకులు ఆసక్తికరమైన కారణాలను పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీల కన్నా సొంత పార్టీలోని వర్గపోరు, వెన్నుపోటు రాజకీయాలే ఈ ఓటములకు ప్రధాన కారణంగా విశ్లేషించారు. డబ్బు, ప్రలోభాల కన్నా స్థానిక సమస్యలు, అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్టకే ఓటర్లు ప్రాధాన్యమిచ్చారని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి.

## ఊహల ఊయల

(మొదటిపేజీ తరువాయి)

ఊసేలేదు. వివిధ తరగతి ప్రజల సంక్షేమానికి ఇదే గతి పట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ వంటివి ప్రశ్నార్థకంగా మారాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి దోహదం చేసిన మహిళలకు నెలకు 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఈ బడ్జెట్‌లోనూ ప్రస్తావనకు నోచుకోలేదు.

**ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే మెరుగు : ముఖ్యమంత్రి చంద్రబాబు**

ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే మెరుగైన బడ్జెట్. రెండు, మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టగలమని ఆశిస్తున్నాం. వైసిపి విధ్వంస పాలన నుంచి కోలుకోవడానికి సమయం పడుతుంది. వ్యవసాయం, సేవా రంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. అమరావతికి రెండు, మూడేళ్లలో ఒక రూపు వస్తుంది. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించాం.

**మాటల్లో గొప్ప..చేతల్లో శూన్యం : సిపిఎం రాష్ట్ర కమిటీ**

రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, సామాజిక న్యాయా నికి తోడ్పడే విధంగా బడ్జెట్ లేదు. ముఖ్యమంత్రి చెబుతున్న 'వికసిత ఆంధ్రప్రదేశ్' మాటల్లో గొప్ప..చేతల్లో శూన్యంలాగా ఉంది. 'సూపర్ సిక్స్'లో భాగంగా మహిళలకు నెలనెలా ఇస్తామని చెప్పిన రూ.1,500, అలాగే నిరుద్యోగ భృతి గురించి పట్టించుకోలేదు. రూ.75 వేలకోట్లు లోటు పూడ్చు కోవడానికి ప్రజలపై అదనపు భారం మోపే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఇది తిరోగమన బడ్జెట్.

**కాకి లెక్కల పద్దు : ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన**

ఇది కాకి లెక్కల పద్దు. వాస్తవాలకు దూరంగా ఊహాజనితంగా ఉంది. అప్పులెంతో చెప్పలేని అపార అనుభవజ్ఞులు రూపొందించిన బడ్జెట్‌లో విశ్లేషణ కూడా లేదు. ఇలా విశ్లేషణకు చోటివ్వని తొలి పద్దు ఇదే. పెరిగిన ఆదాయం 3.4 శాతం అయితే లెక్కల్లో 45 శాతం చూపించారు. సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడారు. ఉద్యోగులను, రైతులను వంచించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇంకా వైసిపి పైనే నిందలు వేస్తున్నారు.

# 'హంగ్'లపై రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో 7 మున్సిపాల్టీలను స్పష్టమైన ఆధిక్యతతో దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ హంగ్‌గా ఉన్న మహబూబాబాద్, జనగామ, వర్ధన్నపేట, కేసముద్రం మున్సిపాల్టీలను దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నది. ఎక్స్ అఫిషియో ఓట్లతో ఈ మున్సిపాల్టీలను చేజిక్కించుకోవడానికి మంత్రాంగం నడుపుతోంది. మహబూబాబాద్ మున్సిపాల్టీలో కాంగ్రెస్ బలం 13 కాగా బీఆర్ఎస్ బలం 11. ఇక్కడ సీపీఐ(ఎం) కాంగ్రెస్‌కు మద్దతునిస్తుండగా, సీపీఐ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. 5గురు ఇండిపెండెంట్లుండగా, ఇందులో ముగ్గురు ఇండిపెండెంట్లు కాంగ్రెస్ శిబిరానికి చేరుకున్నట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ బలం 19కి చేరింది. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 19 సభ్యుల బలం కాగా, ఇదే వాస్తవమైతే కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ మున్సిపాల్టీని చేజిక్కించుకున్నట్టే. జనగామ మున్సిపాల్టీలో కాంగ్రెస్ 12, బిఆర్ఎస్ 13 కౌన్సిలర్లను గెలుచుకుంది. సిపిఐ(ఎం) 1, ఇండిపెండెంట్లు 4గురున్నారు. కాంగ్రెస్ పార్టీకి సిపిఐ (ఎం) మద్దతు వుంది. ఈ రెండు పార్టీలు కలిసే పోటీ చేయడంతో కాంగ్రెస్ బలం ప్రస్తుతం 13 కౌన్సిర్లకు పెరిగింది. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 16 అంటే కాంగ్రెస్‌కు మరో ముగ్గురు ఇండిపెండెంట్ల మద్దతు అవసరం. జనగామ మున్సిపాల్టీలో బిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వుండడంతో ఆయన ఓటును ఇక్కడ వినియోగించుకుంటారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వుండడంతో ఆయన ఓటు కాంగ్రెస్ బలాన్ని 14కు చేరుస్తుంది. ఇండిపెండెంట్లపైనే కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారు. తొర్రూరు మున్సిపాల్టీని చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. తొర్రూరులో మున్సిపాల్టీలో కాంగ్రెస్ 7, బిఆర్ఎస్ 9 మంది కౌన్సిలర్లను గెలుచుకుంది. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఓటుతో ఇక్కడ కాంగ్రెస్ బలం 8కి పెరుగనుంది.వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్యను ఇక్కడ ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఓటు హక్కును వినియోగించుకుంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ బలం సమానంగా 9కి చేరుతుంది. అప్పుడు టాస్ కీలకంగా మారే అవకాశముంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌తో పాటు బోధన్, కామారెడ్డి మున్సిపాల్టీల్లో హంగ్ ఏర్పడిన విషయం విధితమే. మేయర్, ఛైర్మన్ సీట్లు పొందేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ సీట్లు గెలవకపోవడంతో పొత్తులపై చర్చలు సాగుతున్నాయి. అయితే నిజామాబాద్, బోధన్‌లో ఎంఐఎం అత్యధిక స్థానాలు గెలవడంతో కాంగ్రెస్‌కు.. ఎంఐఎంతో జత కట్టడం అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో మద్దతు కోసం ఎంఐఎం కిటుకు(కండీషన్) పెట్టినట్టు సమాచారం. నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు మద్దతిస్తే.. బోధన్‌లో ఛైర్మన్ సీటు ఆశిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు చర్చలు సాగుతున్నాయి. అయితే కామారెడ్డిలో పొత్తులపై ఇంకా సమీకరణాలు కొలిక్కి రాలేవు. స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు గెలవగా.. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంతో ఆ పార్టీ బలం 22కు పెరిగింది. మరో మూడు సీట్ల దూరంలో ఉంది. ఇక్కడ బీజేపీ 16, బీఆర్ఎస్ 11 గెలవడంతో బీఆర్ఎస్ మద్దతు కీలకమైంది. ఆయా మున్సిపాల్టీల్లో ముందస్తుగా గెలిచిన వారిని క్యాంపులకు తరలించినట్టు సమాచారం.

పరిగి ఛైర్మన్ పీఠం కోసం అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. 18 వార్డులలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8, ఇద్దరూ ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు సమానంగా కౌన్సిలర్లు రావడంతో స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారారు. స్వతంత్ర అభ్యర్థుల కోసం ఇరు పార్టీల నాయకులు గొడవపడ్డారు. ఒకటో వార్డుకు చెందిన స్వతంత్ర అభ్యర్థి కురువ అక్కమను బీఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లగా, మూడో వాడికి చెందిన స్వతంత్ర అభ్యర్థి మూడవత్ హనుమంతు నాయక్‌ను కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఛైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ మొదలైంది. ఎక్స్‌అఫిషియో సభ్యులు కీలకం అవుతారు. మొయినాబాద్‌లో 26 వార్డులకుగాను కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 7, బీజేపీ 4, ఇతరులు 5 మంది గెలిచారు. ఇక్కడ ఆయా పార్టీలు తమ అభ్యర్థులను క్యాంప్‌లకు తరలించారు. కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర అభ్యర్థుల సహకారంతో ఛైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. పలువురి స్వతంత్ర అభ్యర్థులతో ఓ మాజీ ఎంపీ మాట్లాడి.. వారిని క్యాంపునకు తరలించారు. ఆమనగల్‌లో మొత్తం 15 స్థానాల్లో బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ ఒకటి గెలిచింది. అయితే ఇక్కడ బీఆర్ఎస్‌కు ఛైర్మన్ పీఠం దక్కకుండా.. బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఎక్స్అఫిషియో ఓట్లతో ఛైర్మన్ పీఠం కైవసం చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గద్వాల్‌లో కాంగ్రెస్ ఛైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకోవాలంటే ఇబ్బంది కరంగా మారనున్నది. కాంగ్రెస్ 16, ఇద్దరు ఇండిపెండెంట్‌లు కలిపి 18 అవుతాయి. ఎంఐఎం కలుపుకుంటే నే పీఠం కైవసం చేసుకొనే అవకాశమున్నది. ఎక్స్ ఆఫీషియోగా ఎమ్మెల్యే ఓటు, ఎంపీ ఓటు, ఎమ్మెల్సీల ఓటు ఎలెక్షన్ కమిషన్ నిబందన ప్రకారం మున్సిపల్‌లో ఓటు ఉంటేనే ఎక్స్ ఆఫీషియో ఓటు చెల్లు బాటు అవుతుందని చెబుతున్నాయి. అదే బిఆర్ఎస్, బీజేపీ జట్టు కట్టిన వారికి బీఆర్ఎస్ 11,బీజేపీ 07 కలిపి 18 కానున్నాయి ఒక్క ఓటు తక్కువ కానున్నది. వీరికి ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఎమ్మెల్సీలు బీఆర్ఎస్‌కి ముగ్గురున్న, ఒక ఎమ్మెల్సీ బీజేపీకి వున్నా గద్వాల మున్సిపాలిటీ లో వారు ఎక్స్ ఆఫీషియో మెంబెర్ గా వేయడానికి వీలు లేదు. ఇప్పుడు గద్వాల మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఉత్కంఠగా నెలకొన్నది.

అలంపూర్‌లో మొత్తం 10 వార్డులు ఉన్నారు.బీఆర్ఎస్05, కాంగ్రెస్ 05 గెలిచారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యే ఉన్నారు. కానీ ఇద్దరు బీఆర్ఎస్ కాబట్టి ఓట్లు వేస్తారని సమాచారం. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం సాధించిన కాంగ్రెస్ తదుపరి రాజకీయ సమీకరణాలపై దష్టి సారించింది. కాంగ్రెస్ తరపున గెలిచిన 31 మంది కౌన్సిలర్లను పార్టీ నాయకత్వం శుక్రవారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించింది. ఎలాంటి అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా కరీంనగర్‌లో మెజారిటీ వార్డులు బీజేపీ కైవసం చేసుకుంది. అయితే మేయర్ పీఠం కోసం కావాల్సిన స్థానాలు రాలేదు. దీంతో మరో ఎనిమిది మంది అదనంగా తమ ఖాతాలో ఉన్నట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే కాంగ్రెస్‌పార్టీ కూడా కరీంనగర్ మేయర్ పీఠాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. "ఎస్, ఎంఐఎం వారితో చర్చలు జరుపుతున్నది. పది స్వతంత్రులు ఉన్నారు. వారందరి బలంతో పీఠాన్ని దక్కించుకుని బీజేపీకి అవకాశం లేకుండా చేయాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. సంగారెడ్డి లోనే కొన్ని మున్సిపాల్టీల్లో ఇదే రకమైన చర్చ నడుస్తోంది.

# జలవనరులకు రూ.18,223 కోట్లు

**- అనంతపురం జిల్లాకు రూ.3,160 కోట్లు**
**- ఉత్తరాంధ్రకు రూ.469 కోట్లు**
**- కృష్ణాడెల్టా సిస్టమ్స్‌కు రూ.1,003.73 కోట్లు**



**అమరావతి – సూర్య వాస్తవం**

రాష్ట్రంలో జలవనరుల ప్రాజెక్టులకు 2026–27 బడ్జెట్లో రూ.18,223 కోట్లు కేటాయించారు. కీలకమైన ఈ శాఖకు గత బడ్జెట్లో రూ.18,019 కోట్లు కేటాయించిన ప్రభుత్వం సవరణ బడ్జెట్లో దాన్ని రూ.14,751 కోట్లకు కుదించారు. మరలా ఈ ఏడాది బడ్జెట్లో రూ.18,223 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ ఖర్చులు రూ.799 కోట్లు, పెట్టుబడి ఖర్చులు రూ.17,424 కోట్లుగా చూపించారు. అయితే కేటాయింపులు మొత్తం గతంతో పోలిస్తే వాస్తవాలకు దగ్గరగా కాకుండా అంకెలనూ అటూఇటుగా స్వల్ప మార్పులు చేసి ప్రతిపాదనల్లో పొందుపరిచారనే విమర్శలూ ఉన్నాయి. గతంలో బడ్జెట్లో గత నాలుగు సంవత్సరాల కేటాయింపు ఖర్చునూ చూపించేవారు. ఈసారి బడ్జెట్లో అటువంటిది లేకుండా నేరుగా గతేడాది బడ్జెట్, సవరించిన అంచనాలు, ఈ ఏడాది ప్రతిపాదనల రూపంలో చూపించారు. ఇందులో వాటర్ రిసోర్స్ సెక్రటేరియట్‌కు రూ.1,427 కోట్లు ప్రతిపాదించారు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్‌కు రూ.852 కోట్లు కేటాయించినట్లు అంచనాల్లో పేర్కొన్నారు. గత పదేళ్లలో వరద ముంపు వల్ల పంటలు దెబ్బతిని ఎక్కువ నష్టాలు వాటిల్లాయి. వీటిల్లో కాలువలు దెబ్బతినడం, సరైన ప్రవాహం లేకపోవడం వంటి వాటివల్ల ఎక్కడికక్కడ నదుల కట్టలు తెగిపోతున్నాయి. వీటి నిర్వహణకు కాలువలు, నదులు కట్టల బలోపేతానికి నిధులు కేటాయిస్తున్నా.. వాటిల్లో ఖర్చులు ఉండటం లేదు. వేర్వేరు ఖాతాలకు బదలాయిస్తున్నారు. అలాగే ఈ ఏడాది కూడా వరద, కాలువల నిర్వహణకు రూ.517.49 కోట్లు కేటాయించారు. కీలకమైన ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.469.84 కోట్లు ప్రతిపాదించారు. గత ఎన్నికల సమయంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తానని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తే అన్ని ప్రాజెక్టులు పూర్తయి అందుబాటులోకి వస్తాయని, దశాబ్దాల తరబడి వేర్వేరు కారణాలతో పూర్తికాకుండా ఉన్నాయని ముఖ్యమంత్రికి సిపిఎం ఎప్పటి నుండో కోరుతోంది. అయినా ఈ ఏడాది రూ.469 కోట్లే కేటాయించారు. ఈ పద్ధతిలో పరిశీలన చేస్తే ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి మరో మూడేళ్లు పడుతుంది. అంటే మరలా ఎన్నికల హామీగా వినియోగించుకునే అవకాశం ఉందనే అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది.

కీలకమైన మైనర్ ఇరిగేషన్‌కు రూ.2 వేల కోట్లు కావాల్సి ఉండగా, రూ.663 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎన్‌టిఆర్ తెలుగు గంగకు రూ.936.87 కోట్లు, తుంగభద్ర బోర్డుకు రూ.319.70 కోట్లు, కడప జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.926.20 కోట్లు, పూర్వ ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.797.24 కోట్లు కేటాయింపులు చేశారు. వీటితోపాటు అనంతపురం జిల్లా ప్రాజెక్టులకు రూ.3,160.41 కోట్లు, కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.479.56 కోట్లు ప్రతిపాదించారు. ముఖ్యమైన గోదావరి డెల్టా సిస్టమ్స్‌కు రూ.203.79 కోట్లు, కృష్ణా డెల్టా సిస్టమ్స్‌కు రూ.1,003.73 కోట్లు ప్రతిపాదించారు. కృష్ణాడెల్టా సిస్టమ్స్‌కు కేటాయించిన నిధుల్లో ఎక్కువ భాగం బుడమేరు డైవర్షన్, కృష్ణానది కరకట్ట వెంట తాడేపల్లివైపు రిటైనింగ్ వాల్ వంటి ప్రాజెక్టులు ఉన్నాయి.

**అసెంబ్లీ సమావేశాలు మంగళవారానికి వాయిదా**

ఏపీ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ రంగానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగాలు పూర్తయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలు మంగళవారానాకి వాయిదా పడ్డాయి.

## బడ్జెట్ అంతా అభూత కల్పనలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, సూపర్‌సిక్స్ హామీలకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. ఇంది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని మరోసారి స్పష్టమయ్యిందని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వడ్డీలేకుండా రూ.10 లక్షల వరకూ రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కేటాయించలేదని తెలిపారు. 50 లక్షల మంది నిరుద్యోగులను మరోసారి మోసం చేశారని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా




భారత్–అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు. భారత్–అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50శాతం టారిఫ్‌లను 18శాతానికి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు. 2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ. అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం. రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో?రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొంటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది. ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది. ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్?డిసెంబర్ మధ్య 27% తగ్గుదల. నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి. డాలర్‌లో కొనుగోళు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది. ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం. స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు. రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.

## మెరుగైన బడ్జెట్ : సీఎం చంద్రబాబు

**అమరావతి – సూర్య వాస్తవం**

ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు, మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి విధ్వంస పాలన నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్ర సహకారంతో ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చుకుంటూ వస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, సేవా రంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాలన్నారు. రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందన్నారు. అమరావతిని త్వరలో జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తామన్నారు. ఇప్పటికే అమరావతికి పశ్చిమ బైపాస్‌తో అనుసంధానం ఏర్పడిందన్నారు. ఇన్నర్, అవుటర్‌రింగ్ రోడ్లు నిర్మిస్తే రాష్ట్రం మొత్తానికి అనుసంధానం ఏర్పడుతుందన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించామన్నారు. రాయలసీమ ఒకప్పుడు కరువు తాండవించేదని కానీ ఇప్పుడు హంద్రీనీవాతో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక వారి పనితీరుకు నిలువుటద్దం అన్నారు. తాను

## భూమిని భయంకరమైన వాతావరణ

# భవిష్యత్తు వైపు నెడుతున్నామా?

**డా. ముచ్చుకోట సురేష్ బాబు**

**అనంతపురం – సూర్య వాస్తవం:** భవిష్యత్తును అంచనా వేయడం సమాజం ఎలా అభివృద్ధి చెందవచ్చో అనే ఊహాగానాలతో పాటు వాతావరణ నమూనాలను కలిపి శాస్త్రవేత్తలు భవిష్యత్ వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తారు. ఈ అంచనాలు సాధారణంగా షేర్డ్ సోసియో ఎకనామిక్ పాత్ వేస్ ఆధారంగా రూపొందించ బడతాయి. ఇవి ఐపిసిసి నివేదికలకు సహాయం చేయడంతో పాటు విధాన నిర్ణయాలకు మార్గదర్శకంగా ఉంటాయి. ప్రస్తుతం దేశాలు ప్రకటించిన ఉద్గార తగ్గింపు విధానాలు ఎక్కువగా "మధ్యస్థ" అభివృద్ధి మార్గానికి అనుగుణంగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో గ్లోబల్ వార్మింగ్ 1.5డిసి పరిమితిని దాటే అవకాశం ఉంది, తద్వారా ఈ శతాబ్దంలోనే అనేక డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల దీర్ఘకాలిక అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడవచ్చు. ఇటువంటి "ఓవర్‌షూట్" పరిస్థితి నుంచి సురక్షిత స్థాయికి తిరిగి రావాలంటే వేగంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు పెద్ద స్థాయిలో కార్బన్ డయాక్సైడ్ తొలగింపు అవసరం కావచ్చు. ఉష్ణోగ్రత ఎంత ఎక్కువగా, ఎంత కాలం పెరిగి ఉంటే, అంత ఎక్కువగా స్వయంగా వేడిమిని పెంచే ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలు, ప్రమాదకర పరిస్థితి ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.

**కీలక పరిమితులను దాటడం**

వాతావరణ వ్యవస్థలో పెద్ద భాగాలను క్లైమేట్ టిప్పింగ్ ఎలిమెంట్స్ అంటారు. ఇవి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత పరిమితిని దాటినప్పుడు అకస్మాత్తుగా మారిపోవచ్చు. మొత్తం 16 ముఖ్య టిప్పింగ్ ఎలిమెంట్స్ గుర్తించ బడ్డాయి; వాటిలో 10 ప్రారంభమైతే గ్లోబల్ ఉష్ణోగ్రతను మరింత పెంచే ప్రమాదం ఉంది. గ్రీన్‌ల్యాండ్ వెస్ట్ అంటార్కిటికా మంచు పటాలు, బోరియల్ పర్మాఫ్రాస్ట్, పర్వత హిమనదాలు, అలాగే అమెజాన్ అడవుల కొన్ని భాగాల్లో ఈ మార్పులు ఇప్పటికే ప్రారంభమై ఉండవచ్చని లేదా త్వరలోనే సంభవించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ మార్పులు సముద్ర మట్టం పెరుగుదలను వేగవంతం చేయడం, భారీ కార్బన్ నిల్వలను విడుదల చేయడం, ఉష్ణోగ్రతలను పెంచడం, పర్యావరణ వ్యవస్థలను అస్థిరం చేయడం వంటి ప్రభావాలు కలిగించవచ్చు.




ఈ టిప్పింగ్ పాయింట్స్ కు సంబంధించిన ఖచ్చితమైన ఉష్ణోగ్రత పరిమితులు ఇంకా స్పష్టంగా తెలియక పోయినా, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పరిమితులు దాటితే స్వయంగా కొనసాగుతూ వేడిమిని పెంచే ప్రక్రియలు ప్రారంభమవుతాయి. దీని వల్ల భూమి దీర్ఘకాలికంగా తిరిగి మార్చలేని విధంగా అత్యంత వేడి స్థితి వైపు వెళ్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, ప్రస్తుతం వేడిని కొంత వరకు తగ్గించే వ్యవస్థల నుంచి వేడిని మరింత పెంచే వ్యవస్థల వైపు మార్పు జరగడం పెద్ద ప్రమాదంగా భావించబడుతోంది.

**మార్పుల అనిశ్చితి**

వాతావరణ నమూనాలు భవిష్యత్ పరిస్థితులను అంచనా వేయడంలో సహాయపడుతున్నప్పటికీ, భూమి వాతావరణ వ్యవస్థ యొక్క పూర్తి సంక్లిష్టతను పూర్తిగా ప్రతిబింబించలేవు. దశాబ్దాల పరిశోధన ఉన్నప్పటికీ, ఇంకా అనేక అనిశ్చితులు ఉన్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు ఇప్పటికే ఏడాది పొడవునా 1.5డిసి స్థాయిని దాటేశాయి. శాస్త్రవేత్తలు ఊహించిన దానికంటే చాలా వేగంగా భూమి వేడెక్కుతోంది. అయితే అసలు ప్రమాదం కేవలం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మాత్రమే కాదు, వాటి వల్ల తదుపరి జరగబోయే పరిణామాలు మరీ భయంకరమైనవి. భూమిపై ఉష్ణోగ్రతను మరింత పెంచే సహజ వ్యవస్థలు ఉన్నాయి. కరుగుతున్న మంచు పలకలు, అంతరించిపోతున్న అడవులు, కరుగుతున్న శాశ్వత హిమనీనదాలు, వేడెక్కుతున్న సముద్రాలు.. ఇవన్నీ కలిసి భారీ స్థాయిలో వేడిని నిలిపి ఉంచే వాయువులను విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలు ఒక్కసారి మొదలైతే, అవి ఒకదానికొకటి తోడై మనిషి విడుదల చేసే కాలుష్యం తగ్గించినప్పటికీ, భూమి వేడెక్కడం మాత్రం ఆగదు. ఏ ఒక్కటి దెబ్బతిన్నా, అది ఒక డొమినో ఎఫెక్ట్ లాగా (వరుస ప్రమాదాలు వలే) మిగిలిన వాటిని కూడా ప్రమాదంలోకి నెడుతుంది. ఇది భూమిని "హాట్ హౌస్ ఎర్త్" దిశగా నెట్టవచ్చు. అంటే కొన్ని శతాబ్దాల పాటు కొనసాగే విపరీతమైన ఉష్ణోగ్రతలూ, పెరిగే సముద్ర మట్టాల భవిష్యత్తు అని అర్థం. ప్రస్తుత ప్రపంచ విధానాలు ఈ ముప్పును నివారించ డానికి సరిపోదు. 20వ శతాబ్దం మధ్యలో ప్రతి దశాబ్దానికి సుమారు 0.05డిసి ఉండగా, ఇప్పుడు అది సుమారు 0.31డిసి కు చేరుకుంది. ఈ వేగంతో కొనసాగితే తీవ్రమైన ప్రభావాలను నివారించడానికి నిర్ణయించిన పరిమితు లను త్వరలోనే దాటే అవకాశం ఉంది. ఇది స్వయంగా వేడిమిని పెంచే ప్రక్రియలను ఆపడానికి మనకు లభించే సమయాన్ని మరింత తగ్గిస్తుంది. అదనంగా, ఏరోసాల్ ఉద్గారాలు తగ్గడం వల్ల వాతావరణంలో ఉన్న చల్లదన ప్రభావం కూడా తగ్గుతోంది. దీనివల్ల గ్లోబల్ ఉష్ణోగ్రతకు సుమారు 0.5డిసి వరకు అదనపు పెరుగుదల రావచ్చు. ఇటీవల కనిపిస్తున్న వేడి పెరుగుదలకు ఇది ఒక కారణంగా భావించబడుతోంది. ఇంకా, ఏరోసాల్ తగ్గుదలతో సంబంధం ఉన్న మేఘాల ప్రతిఫలనం మార్పులు, భూభాగ ఉపరితల ప్రతిబింబనలో మార్పులు, భూమి కార్బన్‌ను గ్రహించే సామర్థ్యం తగ్గడం వంటి ఇతర ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలు కూడా ఈ వేగవంతమైన మార్పులకు కారణమవుతున్నాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి కేవలం తాత్కాలిక ప్రభావాలు కాకుండా, వాతావరణ వ్యవస్థలో లోతైన మార్పుల సంకేతాలు కావచ్చు. వాతావరణంలో మనం ఒక ప్రమాదకరమైన మలుపుకు చేరుకుంటున్నామని ప్రముఖ శాస్త్రవేత్తలు ఒన్ ఎర్త్ అనే జర్నల్ లో ఫిబ్రవరి 2026 లో ప్రచురించిన పరిశోధనా వ్యాసంలో హెచ్చరిస్తున్నారు. వేల ఏళ్లుగా మానవ నాగరికత ఒక స్థిరమైన వాతావరణంలోనే విలసిల్లింది. కానీ ఇప్పుడు ఆ స్థిరత్వం వేగంగా కనుమరుగవుతోంది. కాలుష్య ఉద్గారాలను తగ్గించడంలో మనం ఎంత ఆలస్యం చేస్తే, తిరిగి వెనక్కి రాలేనంతటి వినాశకరమైన పరిమితులను దాటే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా లభించే సందేశం చాలా స్పష్టం: అనిశ్చితి అంటే రక్షణ కాదు. అది మనం మరింత వేగంగా స్పందించాలని ఇచ్చే హెచ్చరిక.

## తిమ్మమ్మ మర్రిమాను ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ...

- శివరాత్రి మహోత్సవం సందర్భంగా వి.వి.ఐ.పిల రాక
- భక్తులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు...
- డ్రోన్, సిసి కెమెరాలతో పాటు నైట్ విజన్ డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా...
- ఉత్సవాలకు పోలీస్ శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం... - జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్





**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మమ్మ మర్రిమాను ఆలయాన్ని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ శనివారం సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం శివరాత్రి మహోత్సవం పురస్కరించుకొని భద్రత ఏర్పాట్లకు సంబంధించి ఎస్పీ ,, డిఎస్పీ శివన్నారాయణ స్వామి, తో కలిసి పరిశీలించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భారీకేడింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించి సూచనలు చేశారు. శనివారం సాయంత్రం నుంచి భద్రత ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకొని ఎటువంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు, డ్రోన్, నైట్ విజన్ డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. అన్ని శైవ క్షేత్రాలలో శివరాత్రి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ భద్రతపరంగా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పీ శివన్నారాయణ స్వామి, సిఐలు నిరంజన్ రెడ్డి ,నాగేంద్ర , ఎస్ఐలు, నరసింహులు ,మక్బూల్ సుమతి ,కృష్ణమూర్తి సిబ్బంది ఉన్నారు.




## చదువు కెరీర్ నాకు రెండు కళ్ళు

- కుప్పం పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం సభలో వెండితెర బాల నటుడు బుల్లి రాజు

**కుప్పం – సూర్య వాస్తవం :** చదువు కెరీర్ తనకు రెండు కళ్ళని వెండితెర బాల నటుడు బుల్లి రాజు (భీమలరేవంత్ పవన్ సాయి సుభాష్) అన్నారు. శనివారం స్థానిక కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కుప్పం పబ్లిక్ స్కూల్ 23వ వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ చలన చిత్ర పరిశ్రమలో హీరోగా , విలన్ గా ఎదగాలనుకుంటున్నట్లు తెలిపారు. తనకు సినీ భవిష్యత్తు ఇచ్చిన దిగ్దర్శకులు అనిల్ రావిపూడికి తాను జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా బుల్లిరాజు తాను నటించిన చిత్రాలలోని పలు డైలాగులను చెప్పి సభికులను అలరించారు. అనంతరం బుల్లిరాజు ను కుప్పం పబ్లిక్ స్కూల్, కుప్పం జూనియర్ కళాశాల యాజమాన్యం దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అంరనీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బిసిఎన్ విద్యా సంస్థల అధినేత బిసి నాగరాజు, సిఈఓ సాగర్ రాజ్, వైస్ చైర్మన్ సునీల్ రాజ్, బుల్లిరాజు తండ్రి శ్రీనివాస్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పుల్వామా దాడి నేటి ప్రతి భారతీయుడి
# గుండెల్లో ఒక చెరగని గాయం

**- పుల్వామా దాడికి అమరులైన జవాన్లకు నివాళులర్పిద్దాం**
**- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్**



**పులివెందుల- సూర్య వాస్తవం :** దేశాన్ని కాపాడే జవాన్లే మనకు అసలైన రక్షకులు అని, వారు సరిహద్దుల్లో నిలబడి పోరాడు తుంటేనే మనం ఇళ్లలో ప్రశాంతంగా జీవించ గలుగుతున్నాం అని, అలాంటి వీరజవాన్లను లక్ష్యంగా చేసుకుని జరిగిన పుల్వామా ఉగ్ర దాడి దేశాన్ని తీవ్రంగా కుదిపేసింది అని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో శని వారం విలేకరులతో మాట్లాడుతూ పుల్వామా దాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారు అనివారి త్యాగం దేశభక్తికి శాశ్వత ప్రతీకగా నిలిచిందన్నారు. జమ్మూ కశ్మీర్‌లో సైనిక బలగాలే లక్ష్యంగా ఉగ్రవాదులు తరచూ దాడులకు పాల్పడుతూ ఉండడం దారుణం అన్నారు. అయితే, దేశాన్ని ఒక్కసారిగా కుదిపేసిన ఘోర ఘటనగా 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఉగ్రదాడి చరిత్రలో నిలిచిపోయింది అన్నారు. ఈ దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందడం జరిగిందన్నారు. పుల్వామా జిల్లాలోని ఓ మలుపు వద్ద సైనిక కాన్వాయ్ వెళ్తున్న సమయంలో, పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా తీసుకొచ్చిన ఓ ఫిదాయి ఉగ్రవాది కాన్వాయ్‌లోకి దూసుకెళ్లి తనను తానే పేల్చుకున్నాడు అన్నారు. ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించి సైనిక వాహనం దగ్ధమైంది అన్నారు. ఘటన స్థలమంతా దుఃఖం, ఆవేదనతో నిండిపోయింది అన్నారు. ఈ ఉగ్రఘాతుకానికి పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలే కారణమని అధికారులు వెల్లడించడం జరిగిందన్నారు. ఈ దాడి తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది అన్నారు. వీరజవాన్ల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ యావత్ భారతదేశం శోకసంద్రంలో మునిగిపోయింది అన్నారు. పుల్వామా దాడి నేటికీ ప్రతి భారతీయుడి గుండెల్లో ఓ చెరిగిపోని గాయంలా నిలిచిపోయింది అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన ఆ వీరసైనికుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది అన్నారు.


## భక్తిశ్రద్ధలతో భాగవత సప్తహ పఠనం

**- మహిళలచే కలశ ప్రదర్శనం**



**లింగాల - సూర్య వాస్తవం :** లింగాల మండలం దిగవపల్లి శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో చివరి రోజు మాఘమాస శనివారం చివరి రోజు కొనసాగిన భాగవత సప్తహ పఠనం పులివెందుల భాగవత భక్త సమాజం నిర్వ హణలో దాతల సహకారాలతో దిగ్విజయవంతంగా సాగిన పఠనం. అనంతరం మంత్ర పుష్పం మహిళలచే కలశ ప్రదర్శనం, చివరిగా భాగవత పండితులకు, నిర్వహకులు ఘన సన్మానం చేపట్టారు. 7 రోజుల పాటు అల్పాహారం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చిన దాతలకు సమాజ పాలక వర్గంవారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు చిన్న శివారెడ్డి సలహాదారులు, నారాయణరెడ్డి గంగిరెడ్డి బి.నారాయణ రెడ్డి రంగ నాథ్ మీడియా కోఆర్డినేటర్ యాగంటి బాల కృష్ణారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ పార్వతి పరమేశ్వరుల వారి కళ్యాణ మహోత్సవం





**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠంలో మహాశివరాత్రి మహోత్సవాలు. శ్రీ జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివ కుమార స్వాములవారి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయినట్లు కార్య నిర్వహణ అధికారి బివి జగన్మోహన్ రెడ్డి తెలిపారు .ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణమూర్తుల తులాభారం , రాత్రి 6.30 కు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం జరుగును. కళ్యాణమూర్తులను సమర్పించిన వారు కళ్యాణోత్సవ ఉభయ దాతలు కీ "శే "సుంకు కృష్ణయ్య శ్రేష్ఠి జ్ఞాపకార్థం ధర్మపత్ని శంకరమ్మ వీర కుమారుడు సుంకు సురేష్ బాబు వీరి ధర్మపత్ని వరలక్ష్మి వీరి కుమారులు నాగ జస్వంత్ శశాంక్ సుంకూర్ డ్రెస్సెస్ బ్రహ్మంగారి మఠం కళ్యాణ మండపం పుష్పాలంకరణ దాతలు వెంకట సుధా సప్లయర్స్ లైటింగ్ సౌండ్ సిస్టమ్స్ భాస్కర్ రెడ్డి, వీరపు ఉమాపతి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగును. వచ్చిన భక్తులకు ప్రత్యేక వసతులు ప్రత్యేక క్యూ లైన్లు చలువ పందిరులు ఏర్పాటు చేశారు. శ్రీ ఈశ్వరి దేవి మఠం నీ విద్యుత్ దీపాలు తో అలంకరించారు. ఈ ఉత్సవాల్లో శ్రీ శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతి తమ్ముడు శ్రీ సంపత్ కుమార్ స్వామి ఉన్నారు.

# నిరాడంబరుడు, ఆదర్శప్రాయుడు సంజీవయ్య

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య నిరాడంబరుడు, నిజాయితీపరుడు, ఆదర్శ ప్రాయుడని కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లిలో స్వర్గీయ దామో దరం సంజీవయ్య 105వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ సంజీవయ్య అటు కాంగ్రెస్ పార్టీకి,ఇటు రాష్ట్రానికి,దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేసిన నిజమైన కాంగ్రెస్ వాది అన్నారు. సమైక్య మద్రాస్ రాష్ట్రంలో రాజాజీ మంత్రి వర్గంలో, ఆంధ్ర రాష్ట్రంలో ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి మంత్రివర్గంలో,ఆంధ్రప్రదేశ్లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు రెండవ ముఖ్యమంత్రిగా 25 నెలలు పనిచేశారు.పండిట్ నెహ్రూ లాల్, బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గాలలో కేంద్ర మంత్రిగా పనిచేశారు.కటిక పేద కుటుంబంలో పుట్టి తుది శ్వాస వరకు నిరాడంబరంగా, నీతివంతంగా సాగిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. 38 సంవత్సరాల చిన్న వయసులో ముఖ్యమంత్రి కావడం,దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి కావడం ఆయన ప్రత్యేకతలు అన్నారు. ఆయన జీవించింది కేవలం 51 సంవత్సరాలు.అయినా ఆంధ్రప్రదేశ్,భారత రాజకీయాల మీద చెరగని ముద్ర వేసిన మహనీయుడు సంజీవయ్య అని తులసి రెడ్డి కీర్తించారు. 65 సంవత్సరాల క్రితమే ఒక దళితుని కాంగ్రెస్ పార్టీ ఒక పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఏఐసిసి అధ్యక్షునిగా చేయడం గమనార్హ మని తులసి రెడ్డి అన్నారు. సంజీవయ్య స్ఫూర్తితో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ పునర్ వైభవానికి, దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమంలో వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బండారు వెంకటేశు, బద్రీనాథ్, నామా వినయ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సేవాఘడ్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్
# జయంతి వేడుకల్లో పటిష్ట చర్యలు చేపట్టండి

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం సేవాఘడ్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయం తి వేడుకలలో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ఈ నెల 15వ తేదీన జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన శనివారం సేవా ఘడ్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లు, బందోబస్తును సమీక్షించారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుండీ భారీగా ప్రజలు, ప్రముఖులు విచ్చేస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులే కుండా బందోబస్తు చర్యలు తీసుకో వాలని సూచించారు.ఈ వేడుకలలో పోలీసు అధికారులు,సిబ్బంది ఏమి చేయాలో ఏమి చేయకూడదో దిశా నిర్ధేశం చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, పలువురు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.





## అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురు నియామకాలు





**పామిడి - సూర్య వాస్తవం :** అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించి నట్లు అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించి వారికి నియా మక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం అధ్యక్షులుగా వెన్నపూస చెన్న కృష్ణారెడ్డి, పులివెందుల నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులుగా కె. కోటీశ్వర రెడ్డి, కమలా పురం నియోజకవర్గం అధ్య క్షులుగా సగిలి శ్రీకాంత్ రెడ్డి, కమలాపురంనియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులుగా కల్లూరు రాజశేఖరరెడ్డి, సింహాద్రిపురం మండల రైతు విభాగం అధ్యక్షులుగా పోచం రెడ్డి చెన్నకేశవరెడ్డి, ముద్దనూరు మండల అధ్యక్షులుగా సీరమ్మ గారి వెంకట సుబ్బారెడ్డి లను నియమించినట్లు జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి లు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ వివిధ పదవులు పొందిన వారికి అఖిల భారత రెడ్డి సంఘం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తమ నాయకత్వంలోరాష్టంలో రెడ్డి యువత, మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నామని తెలిపారు.

**రెడ్డి సమాజం ఐక్యమే మన బలం**

మన సేవా ప్రయాణం విజయవంతం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని తెలిపారు.పదవులు పొందిన వారు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లాల, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కడప హజ్ హౌస్ పనులను వేగవంతం చేయాలి


**- రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హస్సన్ బాషాతో బీటెక్ రవి భేటీ**



**పులివెందుల - సూర్య వాస్తవం :** విజయవాడ స్పీకర్ ఛాంబర్‌లో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హస్సన్ బాషాతో పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ బిటెక్. రవి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం వారితో మర్యాదపూర్వకంగా కలిసి కడప హజ్ హౌస్ పెండింగ్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. అలాగే వచ్చే ఏడాది హాజీల హజ్ యాత్రల విషమై పులివెందుల ప్రాంత ముస్లింలకు తమ వంతు సహకారం అందించాలని కోరడం జరిగింది. ఈ విషయాలపై రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హస్సన్ బాషా సానుకూలంగా స్పందించి హజ్ హౌస్ పనులను త్వరలోనే పూర్తిచేసే విధంగా కృషి చేస్తానని బీటెక్ రవికి హామీ ఇచ్చారు.

## రహదారి పనులు.. దుమ్ముతో పరేషాన్

**తొండూరు - సూర్య వాస్తవం:** తొండూరు మండల పరిధిలోని నిర్మిస్తున్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 716-జి) పనుల్లో భాగంగా పులివెందుల-ముద్దనూరు మార్గంలో పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుపనులు బిట్లుబిట్లుగా చేస్తుండడంతో రోడ్డుకు ఒక పక్క మట్టి, కంకర వేసి పనులను కొనసాగిస్తున్నారు. మట్టి వేసిన చోట ట్యాంకర్‌తో నీరు పోస్తూ దుమ్ము దూళీ రేగకుండా పనులు చేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ అలా చేయక పోవడంతో వాహనదారులు దుమ్మూధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలూ కనిపించనంతగా దుమ్ము లేవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# రాష్ట్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో, మండలిలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో రైతులకు, యువతకు, నిరుద్యోగులకు, ఆడబిడ్డలకు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, ముస్లిం మైనారిటీలకు అన్యాయం జరిగిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రమని, 60 నుంచి 70 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారని, కాబట్టి బడ్జెట్లో వ్యవసాయ రంగానికి సింహభాగం కేటాయించాలి అన్నారు. కానీ దురదృష్టవశాత్తు 2026-27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ రూ.3,32,205 కోట్లు కాగా అందులో వ్యవసాయ రంగానికి పిల్లికి భిక్షం వేసినట్లు కేవలంరు 11745 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. అంటే మొత్తం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 3. 53శాతం మాత్రమే కేటాయింపు. వ్యవసాయ రంగానికి సాగునీటి ప్రాజెక్టులు గుండెకాయ లాంటివి.అందుకోసమే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మొత్తం బడ్జెట్లో సాగునీటి రంగానికి దాదాపు 15% నిధులు కేటాయించేవి.కానీ దురదృష్టవశాత్తు 2026 27 రాష్ట్ర బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు కేవలం 9906 కోట్లు మాత్రమే అనగా 2.98 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. దీన్నిబట్టి చూస్తే రాబోవు రోజుల్లో సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుకు తప్పదు. గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణం. అందులో నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి,50 ఏళ్లకే ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీలకు పెన్షన్ అనే అంశాలు చాలా ప్రభావితం చేశాయి. కానీ ఈ మూడు అంశాలను గత బడ్జెట్లలో గాని, ఈసారి బడ్జెట్లో గాని పూర్తిగా విస్మరించారు.

**నిరుద్యోగ భృతి**

కూటమి అధికారంలోకి వస్తే ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు చొప్పున,ఏడాదికి 36 వేల రూపాయలు నిరుద్యోగ భృతి కింద ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో పేర్కొనడం జరిగింది. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు.ఆ ప్రకారంగా ఏడాదికి 7200 కోట్ల రూపాయలు నిరుద్యోగ భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి . 2024 - 25, 2025 - 26 సంవత్సరాలలో ఇవ్వలేదు.2026- 27 బడ్జెట్లో కూడా కేటాయింపులు లేవు.ఈ విధంగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించింది.

రాష్ట్ర జనాభాలో యువత దాదాపు 25 శాతం ఉంటుంది. మొత్తం బడ్జెట్ మూడు లక్షల 32వేల 205 కోట్లు కాగా యువతకు,క్రీడలకు సంబంధించి కేటాయించింది కేవలం రు 438 కోట్లు మాత్రమే. అంటే మొత్తం బడ్జెట్లో 0.13శాతం. ఇది అత్యంత శోచనీయం.

**ఆడబిడ్డ నిధి**

సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన హామీ. 19 - 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు చొప్పున ఏడాదికి 18 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది . రాష్ట్రంలో ఈ మధ్య వయసులో ఉన్న ఆడబిడ్డలు ఒక్క కోటి 80 లక్షల మంది ఉన్నారు.అంటే ఏడాదికి రు 34400 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.2024- 25 లో గాని,25 -26 లో గాని ఒక పైసా ఇవ్వలేదు.ఇప్పుడు కూడా కేటాయింపులు లేవు . ఆడబిడ్డలను నమ్మించి మోసగించడం అత్యంత దురదృష్టకరం.

**50 ఏళ్లకే పెన్షన్**

బిసి, ఎస్సి,ఎస్టి,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పడం జరిగింది. ఒక్కొక్కరికి నెలకు 4000 రూపాయలు చొప్పున ఏడాదికి 48 వేల రూపాయలు ఇస్తామని చెప్పింది. రాష్ట్రంలో 17 లక్షల మంది ఈ పథకం కింద అర్హులు ఉన్నారు. రు 8160 కోట్లు కేటాయించాలి కానీ ఒక పైసా కూడా కేటాయించలేదు. 2024 -25 లో, 25- 26 లో ఇవ్వలేదు.26 27లో కూడా కేటాయించలేదు.ఇది పక్కా మోసం.


**ధరల స్థిరీకరణ నిధి**

ఈ పద్దు కింద బడ్జెట్లో కేవలం 560 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఇది చాలా స్వల్పం. ఈ విధంగా 2026 - 27 రాష్ట్ర బడ్జెట్లో రైతులకు,యువతకు, నిరుద్యోగులకు ఆడబిడ్డలకు,బిసి, ఎస్సి, ఎస్టి,ముస్లిం మైనారిటీలకు అన్యాయం, మోసం ద్రోహం జరిగిందని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు.

### దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా

# ఎదిగిన నాయకుడు దామోదరం సంజీవయ్య

**- జిల్లా సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** దామోదరం సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సేవా దృక్పథాన్ని పెంచుకోవాలని, దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు దామోదరం సంజీవయ్య అని సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. శనివారం ఉదయం మదనపల్లి కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో దామోదరం సంజీవయ్య 105వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దళిత కుటుంబంలో పేదరికంలో పుట్టాడని, అట్టడుగు స్థాయి నుండి దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా, కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పదవులను అధిరోహించి తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేశారన్నారు. మద్రాసులో లా చదువుకొని తర్వాత రాజకీయాలలోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి స్థాయికి మరియు కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏఐసీసీ ప్రెసిడెంట్ గా రెండేళ్లు పనిచేశారని, ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాదులో ఉన్న సంజీవయ్య పార్కుకు ఆయన జ్ఞాపకార్థం సంజీవయ్య పార్క్ అని నామకరణం చేశారన్నారు. అలాగే విశాఖపట్నంలోని లా విశ్వ విద్యాలయాన్ని ఆయన జ్ఞాపకార్థం దామోదరం సంజీవయ్య లా విశ్వవిద్యాల యంగా నామకరణం చేశారన్నారు.



టీచర్లకు పింఛన్లు అందుతున్నాయి అంటే దానికి కారణం దామోదరం సంజీవయ్య అని, బడుగు బలహీన వర్గాలకు భూమి అందేలా ఎన్నో భూ సంస్కరణలను చేపట్టారని పేర్కొన్నారు. ఆయన జీవితాంతం సమాజ హితం కోసం పోరాడారన్నారు. పాఠశాల విద్యార్థులందరూ దామోదరం సంజీవయ్య జీవితం నుంచి స్ఫూర్తి పొంది, సమాజానికి ఉపయోగపడే పనులను చేయాలని సూచించారు. జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ సభ్యులు మాట్లాడుతూ..... దామోదరం సంజీవయ్య 105వ జన్మదిన వేడుకలను జిల్లా కలెక్టరేట్లో జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. తన తల్లి నుండి స్ఫూర్తి పొంది సామాజిక పింఛన్లను ప్రారంభించిన మొదటి నాయకుడు దామోదరం సంజీవయ్య అని పేర్కొన్నారు. దాదాపు ఆరు లక్షల ఎకరాలను బడుగు బలహీన వర్గాలకు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించార న్నారు. రాష్ట్రంలో ఏసీబీ సంస్థ ఏర్పాటు ఆయన వల్లనే సాధ్యమైందని కొనియాడారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధు సూదన్ రావు, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, కుమ్మరి, శాలివాహన డైరెక్టర్ భావన, డివిఎంసి కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన శ్రీ చైతన్య స్కూల్ బస్సు

**- తృటిలో తప్పిన ప్రమాదం**
**- స్కూల్ బస్సు అతి వేగమే కారణమా?**







**లింగాల క్రైమ్ – సూర్య వాస్తవం :** లింగాల మండలం రామట్ల పల్లె గ్రామ సమీపంలో గుణకన్నపల్లె నుండి పులివెందుల పోస్తున్న ఆర్టీసీ బస్సు, పులివెందుల నుండి గుణకన్నపల్లె సైడ్ వెళ్తున్న శ్రీ చైతన్య స్కూల్ బస్సు ఆర్టిసి బస్సును ఢీకొట్టడంతో స్కూల్ బస్సు ముందర అద్దాలు పగిలాయి, విద్యార్థులకు ఎటువంటి ప్రమాదము జరగలేదు, కానీ ఆర్టీసీలు బస్సులో ఉన్న సుబ్బమ్మ అనే మహిళపై స్టెప్నీ టైరు ఎగిరి మింద పడడంతో చేతులకు గాయాలు అయినట్లు ప్రయాణికులు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ కు స్టీరింగ్ తగిలి చెస్ట్ పెయిన్ రావడం జరిగింది అన్నారు. ఈ ప్రమాదానికి స్కూల్ బస్సు కారణమని డ్రైవర్ అతివేగంతో రావడంతో కంట్రోల్ చేయలేక అదుపుతప్పి ఆర్టిసి బస్సును గుద్దడం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ స్కూల్ బస్సుల డ్రైవర్లు అతివేగంగా బస్సులు నడపడం మానుకోవాలని ప్రయాణికులు చెప్తున్నారు. త్రుటిలో తప్పిన ప్రమాదం కాబట్టి ఏలాంటి ఇబ్బందులు జరగలేదని అదే ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే పిల్లల ప్రాణా లకు రక్షణ ఎవరని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. ఎగుడుదిగుడు రోడ్లలో బస్సులు చిన్నగా వెళ్లాలి తప్ప స్పీడు వెళ్లకూడదని అంత స్పీడు రావాల్సిన అవసరం ఏమొచ్చిందని వారు అంటున్నారు. నిర్లక్ష్యంగా బస్సులు తోలే వారిపై ఆర్టిఓ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# నిజాయితీని చాటుకున్న రైతు బి.లక్ష్మి రెడ్డి

**- దొరికిన పర్సును బాధితుడికి అందజేత**
**- అభినందించిన అంకంపేట గ్రామస్తులు**






**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** రోడ్డుపై 100 రూపాయల నోటు కనిపిస్తే చాలు అదృష్టం వరించిందని చుట్టూరా చూసి చప్పుడు కాకుండా జేబులో పెట్టుకునే ఈ రోజుల్లో రైతు బి. లక్ష్మి రెడ్డి తనకు దారిలో దొరికిన పర్సును ఆ పత్రిక విలేకరికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే..... అనంతపురనికి చెందిన క్రైమ్ రిపోర్టర్ సులేమాన్ శనివారం నాడు కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి తన బైక్ పై బయలు దేరాడు. బైక్ పై ప్రయాణిస్తున్న క్రమంలో దారిలో రోడ్డుపై పర్సు పారేకున్నాడు. ఇది గమనించిన అంకంపేట కీ చెందిన రైతు బీ. లక్ష్మి రెడ్డి బైక్ ఆపి పర్సును పరిశీలించాడు.పర్సులో నగదు ఉన్న విషయాన్ని గుర్తించి నగదుతో పాటు బాధితుడికి సంబంధించిన ఆధార్ కార్డు, మీడియా అక్రిడేషన్ కార్డు, ఎటిఎం కార్డు ఉండడంతో వాటి ఆధారంగా సదరు విలేకరికి ఫోను ద్వారా తెలియపరచి పర్సును అప్పగించాడు. పెద్ద మొత్తంలో డబ్బులు దొరికిన కూడా డబ్బులు బాధితుడికి చేరేలా చొరవ చూపుతూ నిజాయితీని ప్రదర్శించిన అంకంపేట బి.లక్ష్మీ రెడ్డిను గ్రామస్తులు అభినందించారు.

# మా కుమార్తె వివాహానికి హాజరుకండి

**- మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందించిన కుప్పాల కుటుంబీకులు**



**పులివెందుల – సూర్య వాస్తవం :** ఫిబ్రవరి 20వ తేదీన జరగబోవు తమ కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరుకావాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కుప్పాల కుటుంబ సభ్యులు వివాహ ఆహ్వానాన్ని అందించారు. శనివారం తాడేపల్లి లోని జగన్ క్యాంపు కార్యాలయంలో షిరిడి సాయి దేవస్థాన చైర్మన్, శేష సాయి ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులైన కుప్పాల కుటుంబ సభ్యులు శ్రీరామ సుబ్బయ్య, నిఖిల్ తదితరులు జగన్మోహన్ రెడ్డిని కలిసి 20 తేదీన తలపెట్టిన చిరంజీవి వంశీకృష్ణ మరియు శరణ్యల వివాహ మహోత్సవానికి తప్పనిసరిగా హాజరై ఆశీర్వచనాలు అందించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి అవకాశాన్ని అందిపుచ్చుకొని వివాహానికి తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, సోమశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బండ లాగుడు పోటీలను ప్రారంభించిన యువ నాయకుడు

**- మొదట బహుమతికి 50,000 అందించిన గుమ్మనూరు ఈశ్వర్**





**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక మండలం పరిధిలో వంకరాజు కాలువ, నెమలపల్లి గ్రామం నందు ప్రసిద్ధి చెందిన పెన్నప్ప దేవాలయం నందు శ్రీ ఎర్రితాత మరియు పకీరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా రాతిదూలం పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగింది.వంక రాజు కాలువ, నెమలపల్లి గ్రామ పెద్దల ప్రత్యేక ఆహ్వానం మేరకు గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై రాతిదూలం లాగుడు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం గుమ్మ నూరు ఈశ్వర్ మాట్లాడుతూ గుత్తి మండలం గానీ పామిడి మండలం గాని గుంతకల్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ఇలాంటి పోటీలు నిర్వహించిన ముందు వరుసలో గుమ్మనూరు కుటుంబం ఉండి ఇలాంటి ఆచారాలను ప్రోత్సహిస్తామని తెలియజేశారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా,గుమ్మనూరు ఈశ్వర్ తన వంతుగా 50వేల రూపాయలు గ్రామ పెద్దలకు గుమ్మనూరు ఈశ్వర్ అందజేశారు ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శివ మహోత్సవానికి పటిష్ట భద్రత

**- డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా**
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురంలో ఆదివారం నిర్వహించనున్న శివ మహోత్సవం కార్య క్రమం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని నీరు ప్రగతి పార్కుకు ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ



కార్యక్రమ స్థలాన్ని జిల్లా ఎస్పీ శనివారం నాడు స్వయంగా పరిశీలించారు. శివ మహో త్సవం కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి స్టేజి నిర్వహణ, బ్యారికేడింగ్, సాధారణ పార్కింగ్, విఐపి పార్కింగ్, తదితర ఏర్పాట్లను సమీక్షించి తగు సూచనలు చేశారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసరాలలో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ సూచించారు. అలాగే ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, అన్ని విభాగాలతో సమన్వయం సాధించి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమ పరిశీలనలో శివ మహోత్సవం నిర్వాహకులు చల్లా లక్ష్మీ ప్రసాద్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు, సి.ఐలు జగదీష్, శ్రీకాంత్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణంలో, శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

# స్థానిక వర్తకులు, మార్వాడీ వ్యాపారుల మధ్య వివాదం

**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లి పట్టణంలో స్థానిక వర్తకులు, మార్వాడీ వ్యాపారుల మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు సామాజిక చర్చకు దారి తీసింది. తమ వ్యాపారాలకు అడ్డు వస్తున్నారనే కారణంతో మార్వాడీ వ్యాపారు లను ఊరు విడిచి వెళ్లిపోవాలని కోరుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే "ఊరు విడిచి వెళ్లిపొమ్మనడానికి ఎవరిచ్చారు హక్కు?" అనే ప్రశ్న స్థానిక ప్రజల్లో గట్టిగా వినిపిస్తోంది. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం.

మన భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి దేశంలోని ఎక్కడైనా నివసించేందుకు, ఏ వృత్తినైనా చేపట్టేందుకు హక్కు కల్పించింది. రాజ్యాం గంలోని ఆర్టికల్ 19 ప్రకారం స్వేచ్ఛగా సంచరించడం, ఎక్కడైనా నివసించడం, ఏ వృత్తి లేదా వ్యాపారం చేయడం ప్రతి భారత పౌరుడి మౌలిక హక్కు. అలాంటి హక్కులను ఎవరూ స్వేచ్ఛగా హరిస్తే అది రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది. ఇదే సమయంలో స్థానికులు మరో ప్రశ్నను లేవనెత్తుతున్నారు. ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాది మంది యువకులు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ



స్థిరపడ్డారు. ఆయా రాష్ట్రాలు కూడా "వెళ్లిపొమ్మని" అంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలనే సూచన వినిపిస్తోంది. దేశం మొత్తం ఒకటే అన్న భావనను దెబ్బతీయే చర్యలు సామర స్యానికి విఘాతం కలిగిస్తాయని వారు అభిప్రాయ పడుతున్నారు. ఇక మార్వాడీ వ్యాపారులు మాత్రం తమకు చట్టబద్ధమైన హక్కు ఉందని, తాము చట్ట పరిధిలోనే వ్యాపారం చేస్తున్నామని స్పష్టం చేస్తున్నారు. "తల తెగిపడినా ఊరు విడిచి వెళ్లం" అంటూ వారు ధైర్యంగా చెప్పడం ఉద్రిక్తతకు కారణమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. వ్యాపార పోటీ సహజమే కానీ అది సామాజిక విభేదాలకు దారి తీస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు. చట్టం అందరికీ సమానం అన్న సూత్రాన్ని కాపాడటం అధికారుల బాధ్యత.

**సంపాదకీయ దృష్టికోణం:**
ప్రాంతీయ భావోద్వేగాలు క్షణిక లాభాలను ఇవ్వొచ్చు కానీ దేశ సమగ్రతకు హాని కలిగిస్తాయి. "మనది -- మీది" అనే గీతలు గీయడం కన్నా "మనందరం భారతీయులమే" అన్న భావన పెంపొందించాల్సిన సమయం ఇది. రాజ్యాంగ హక్కులను గౌరవిస్తూ పరస్పర గౌరవంతో సమస్యలకు పరిష్కారం కనుక్కోవడమే శ్రేయస్కరం.

# బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

**- అన్నమయ్య జిల్లా ఎస్టియు అధ్యక్షుడు అంకం శివారెడ్డి**



**రాయచోటి–సూర్య వాస్తవం:** ఉద్యోగులకు రావాల్సిన పిఆర్సి, ఐఆర్‌కు బడ్జెట్ కేటాయించక పోవడం అన్యాయని అన్నమయ్య జిల్లా ఎస్టియు జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రపత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత 15 నెలలుగా రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన గ్రాడ్యుటీ కేటాయింపులు చేయకపోవడం బాధాకరమని ఆయన చెప్పారు. అలాగే ఉద్యోగులకు రావలసిన బకాయిలకు గాను కేటాయింపులు చేయక పోవడం దారుణం. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్య సేవలు మొత్తం నత్త నడకన నడుస్తూ ఉంటే కేవలం నాలుగు వేల కోట్లు కేటాయించడం ఏమాత్రం సరిపోదు.రావలసిన మెడికల్ బిల్లు లు చాలా ఉన్నాయన్నారు. విద్యారంగానికి 32,308 కోట్లు ఏమాత్రం సరిపోదన్నారు.మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు.

# నాలుగు తులాలు బంగారు చోరీ



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** మండలంలోని దప్పేపల్లి పంచాయతీలోని గల్లవాండ్ల పల్లెలోని వీరాంజనేయులు ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడి నాలుగు తులాలు బంగారు అపరిచి పోయినట్లు ఎస్ఐ గోల్కొండ శోభ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు పొలం పనులకి వెళ్ళగా పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరవ తాలాలు పగలగొట్టి బంగారు అపహకరించకపోయారని వీరాంజనేయులు తెలిపారని ఆమె తెలిపారు. ఈ మేరకు శనివారం డాగ్ స్క్వాడ్,క్లూస్ టీం చేరుకొని పరిశీలించామని ఆమె తెలిపారు. ఈ మేరకు వీరాంజనేయులు ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు వరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# జవాన్ల త్యాగం... భారత చరిత్రలో చెరగని ముద్ర

**- ఎస్ఐ గోల్కొండ శోభ**




**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** 2019లో జరిగిన పుల్వామా దాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు లక్కిరెడ్డిపల్లి ఎస్సై గోల్కొండ శోభ, గ్లోబల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దాక్షాయని ఆధ్వర్యంలో విద్యార్థులుతో కలసి ఘన నివాళులు అర్పించారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శోభ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఇప్పటికీ స్ఫూర్తినిస్తోందని అన్నారు.2019లో ఈ రోజున పుల్వామాలో ప్రాణాలు అర్పించిన వీర సైనికులను స్మరించుకుంటూ వారి సేవ, సంకల్పం, దేశభక్తి ఎప్పటికీ మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచి పోతామని తెలిపారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఏటా బ్లాక్ డేగా భారతీయులు జరుపుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు


# టీడీపీ కార్యకర్త మృతికి నివాళులర్పించిన డీసీఎంఎస్ చైర్మన్



**ప్యాపిలి– సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలం జక్కాసానిగుంట్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ తండ్రి స్వర్గస్తులయ్యారు. తెలుసుకున్న. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన వై.నాగేశ్వరరావు యాదవ్, శైలజ యాదవ్, రామ్మోహన్ నాయుడు పలువురు టిడిపి నాయకులు తదితరులు నివాళులర్పించారు.

# సీఎం చంద్రబాబు నాయుడుతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి భేటీ

**- రాయచోటిలో తాగునీటి కోసం రూ.150 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన**
**- వెలిగల్లు కాలువ మరమ్మతులు-విస్తరణకు రూ.75 కోట్ల నిధులు మంజూరుపై చర్చ**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** హంద్రీనీవా ద్వారా రాయచోటికి తాగు-సాగునీరు అందించనున్నందుకు సీఎంకు మంత్రి కృతజ్ఞతలు.రాయచోటి మున్సిపాలిటీకి రెండో వెలిగల్లు లైన్ విడత త్రాగునీటి సరఫరా కోసం రూ.150 కోట్ల కేటాయింపులు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అమరావతి సచివాలయంలో భేటీఅయ్యి ప్రతిపాదించారు. అలాగే వెలిగల్లు కాలు మరమ్మతులు, విస్తరణ పనుల కోసం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎం ని మంత్రి మనవి చేశారు. ఈ సందర్భంగా హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయచోటికి తాగు నీరు, సాగునీరు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఉసూరుమనిపించిన బడ్జెట్

**- ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్ రమణా రెడ్డి**



**అనంతపురం – సూర్య వాస్తవం:** శనివారం నాడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు మొండి చేయి చూపించిందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పిఆర్‌సికి, ఐ ఆర్‌కు, మూడు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టినా పిఆర్‌సి ఊసే లేదు. ఇది చాలా అన్యాయ బడ్జెట్. ఇది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల కు మింగుడు పడడం లేదు. ఐఆర్ ప్రహరణకు బడ్జెట్ కేటాయింపు లేదు. సిపిఎస్ రద్దు కు ఎటువంటి హామీ లభించలేదు. ఇంక డిఎలు, ఆర్థిక శెలవుల నగదు బకాయిలకు మోక్షమెప్పుడు. కెజిబి విలలో పని చేసే స్టాఫ్‌కు మినిమం టైమ్ స్కేల్ వర్తింపు కలగా మిగిలిపోతోంది. ముఖ్యంగా పిఆర్‌సి ప్రక టనకు నిధులు కేటాయించాలి. ఇలా కేటాయించని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఉద్యమించకతప్పదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు, నీలూరు రమణా రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు

# రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో లిటిల్ ఏంజెల్స్ విద్యార్థుల విజయచక్రం



**కనేకల్లు – సూర్య వాస్తవం:** మండలంలో విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరోసారి తన ప్రతిభా పటిమను రుజువు చేసింది. గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో మెరిసేలా తీర్చిదిద్దుతూ విద్యలో నాణ్యతకు కొత్త ప్రమాణాలు నెలకొల్పుతోంది. శనివారం విజయవాడ నగరంలో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విశిష్ట విజయాలను సాధించారు. తన్వి, యశ్విత, మంజు మహర్షి, యశస్విని, అన్విత రాష్ట్ర స్థాయిలో మెరిసి తమ పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. కఠినమైన పోటీలో అనేక జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులను అధిగమిస్తూ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా తన్వి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాల చరిత్రలో మరో గర్వకారణంగా నిలిచింది. ఆమె ప్రతిభ, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసి ఈ విజయాన్ని సాధ్యంచేశాయి. అబాకస్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొం దించడమే కాకుండా, వేగం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల అందిస్తున్న శిక్షణ ప్రశంసనీయం.పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, భారతి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కృషి ఉంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని మా విద్యార్థులు నిరూపించారు" అని తెలిపారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.కనేకల్లు మండల ప్రజలు ఈ విజయాన్ని తమ ప్రాంత గౌరవంగా భావిస్తూ విద్యార్థులను అభినందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధిస్తూ లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరింత ఉన్నత స్థాయికి చేరాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.



# ‘ఫంకీ’కి ప్రేక్షకుల నుంచి అమితాదరణ : విశ్వక్‌సేన్

‘ఫంకీ’ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాం. మీ ఆదరణ మాకెంతో ఊరటనిచ్చింది. అన్ని తరగతుల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. నా సినీ ప్రయాణంలో ఇలాంటి సినిమా చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రేక్షకులతో కలిసి మా చిత్ర యూనిట్ అంతా సినిమా చూశాము. ప్రేక్షకులు ప్రతి జోక్‌ని ఎంజాయ్ చేస్తూ, నవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మా సినిమాపై ఇంతటి ప్రేమ కురిపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమాలో కామెడీతో పాటు ప్రేమ కథ, భావోద్వేగాలు కూడా బాగా పండాయి. రెండు గంటల పాటు హాయిగా నవ్వుకునేలా ఉంటుందని ముందునుంచి చెబుతూ వచ్చాము. మా నమ్మకం నిజమై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది’ అని కథానాయకుడు విశ్వక్‌సేన్ అన్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘ఫంకీ’ చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్ర యూనిట్ బృందం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించి చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. హీరో విశ్వక్‌సేన్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, కథానాయిక కయాదు లోహర్, దర్శకుడు అనుదీప్ కెవి మాట్లాడారు.

# రోషన్ ‘ఏమో ఏమో ఇది’








శైలేష్ కొలను, రోషన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి ‘ఏమో ఏమో ఇది’ అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ‘ద ఫస్ట్ బ్రీజ్’ పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను కూడా చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో రోషన్ సరసన ‘కన్నప్ప’ ఫేమ్ ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరు స్తున్నారు.

ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.



# సమ ఉజ్జీల సమరానికి వేళాయే..





**- నేడు భారత్ ఐ పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు**

**పొంచివున్న వర్షం ముప్పు**

**- రాత్రి 7.00గం॥ల నుంచి**

**కొలంబో:** టి20 ప్రపంచకప్‌లో సమవుజ్జీల సమరానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎ ఈ రెండుజట్లు ఆడిన తొలి రెండు మ్యాచుల్లోనూ గెలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగుతున్నాయి. నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు టాప్ బెర్త్ ఖాయం కానుండగా... ఇప్పటికే ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ మొదలుపెట్టారు.

ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం భారత జట్టులో కీలక మార్పులు చోటు చేసుకోనుంది. అనారోగ్యం కారణంగా నమీబియాతో మ్యాచ్‌కు దూరమైన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ.. పాక్‌తో మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చాడు. దీంతో సంజూ శాంసన్‌పై వేటు పడటం ఖాయం. గత మ్యాచ్‌లో సంజూకు అవకాశం లభించినా.. సద్వినియోగ పరుచుకోలేకపోయాడు. 8 బంతుల్లో 22 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇక కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశముండడంతో కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది. దీంతో అర్ష్‌దీప్ సింగ్‌పై వేటుపడటం ఖాయం. పాక్‌పై కుల్దీప్ యాదవ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. అతడు 3 టి20ల్లో 8 వికెట్లు పడగొట్టాడు. కాబట్టి అతడిని తుది జట్టులోకి తీసుకోవడం ఖాయమే. ఈ టోర్నీలో భారత్ తన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో, రెండో మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు పాకిస్థాన్ నెదర్లాండ్స్, అమెరికా జట్లను ఓడించింది. భారత్‌తో పోరుకు పాకిస్తాన్ చివరి వరకు ఐసిసితో సుదీర్ఘ చర్చలు జరిపి చివరి నిమి షంలో ఆడతామని ప్రకటించింది. దీంతో ఈ మ్యాచ్ ప్రాధాన్యత సంతరించకుంది. గ్రూప్-ఎ నుంచి సూపర్-8కు చేరాలంటే ఇరుజట్లకు గెలుపు తప్పనిసరి.

పాకిస్తాన్ కెప్టెన్ అఘా సల్మాన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. షేక్‌హ్యాండ్ వివాదంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... భారత్‌తో కరచాలనం చేసేందుకు పాకిస్తాన్ సిద్ధంగా ఉందని, కానీ ఏం జరుగుతుందో చూద్దామని బదులిచ్చారు. ఓపెనర్ అభిషేక్ శర్మ ఆదివారం జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయంగా కనబడుతోంది. తమజట్టు ఉత్తమమైన జట్టుతోనే తాము తలపడాలని అనుకుంటున్నట్లు సల్మాన్ తెలిపారు. బౌలర్ ఉస్మాన్ తారీఖ్ యాక్షన్ వివాదం గురించి స్పందిస్తూ... ఉస్మాన్‌కు ఐసిసి రెండుసార్లు క్లియరెన్స్ ఇచ్చిందని, ఎందుకు అంతగా అతని యాక్షన్ గురించి చర్చిస్తున్నారో అర్థంకావడం లేదని, అతనేమీ దీని గురించి పట్టించుకోవడం లేదన్నారు. అతను మా ట్రంప్‌కార్డ్ అవుతారన్నారు. ఇక టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం.. షేక్‌హ్యాండ్ ఉంటుందా? అనే ప్రశ్నకు ‘ఇంకా 24 గంటలు సమయం ఉందిగా’ అని బదులిచ్చాడు. ఐసిసి ప్రపంచకప్‌లలో ఇండియాపై పాకిస్తాన్‌కు మంచి రికార్డు లేదు. టి20 ప్రపంచకప్‌లో ఇరుజట్లు ఇప్పటివరకు 8సార్లు తలపడగా.. భారత్ 7సార్లు, పాకిస్తాన్ ఒకసారి మాత్రమే విజయం సాధించాయి.

**పొంచివున్న వర్షం ముప్పు**

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. హిందూ మహాసముద్రం, ఆగేయ బంగాళాఖాతం పరిసరా ల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీంతో 15న తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశాలు న్నాయని అందులో తెలిపింది. దీని ప్రభావం దక్షిణాది రాష్ట్రాలతో పాటు శ్రీలంకలో వర్షాలు కురి సే అవకాశమున్నట్లు తెలిపింది. దీంతో కొలంబోలో ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ఆటంకం కలిగించే అవకాశాలున్నాయని పేర్కొంది.

**జట్లు(అంచనా)..**

భారత్: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్ శర్మ/సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, దూబే, రింకు సింగ్, బుమ్రా, అర్ష్‌దీప్/కుల్దీప్, వరుణ్ చక్రవర్తి.

పాకిస్తాన్: అఘా సల్మాన్(కెప్టెన్), ఫర్హాన్, ఆయుబ్, బాబర్, ఉస్మాన్(వికెట్ కీపర్), షాదాబ్, నవాజ్, అష్రాఫ్, షాహీన్, సల్మాన్, అబ్రార్.

# ఏపీ వ్యవసాయ బడ్జెట్ రూ.53,752 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేశామని, అలాగే పోలవరం ప్రాజెక్టు పనులు 60 శాతం వరకు పూర్తియినట్లు చెప్పారు. వంశధార-2, హంద్రీనీవా, పూలసుబ్బయ్య వెలిగొండ, పోలవరం పూర్తికి కృషి చేస్తున్నామని, గ్లోబల్ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్లకు పైగా ఒప్పందాలు జరిగాయన్నారు. అలాగే భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు 97 శాతం పూర్తయ్యాయని, ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు చెప్పారు. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని, ఉచిత విద్యుత్‌తో లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

**గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ**

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ ప్రాంతమని మంత్రి తెలిపారు. రాయలసీమ కోసం ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్. 2030 నాటికి ఉద్యాన పంటల విస్తీర్ణం 14.41 లక్షల హెక్టార్లకు విస్తరణ ఉంటుందన్నారు. ప్రపంచ మార్కెట్లతో అనుసంధానికి రోడ్ల కనెక్టివిటీ ఉంటుందని, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో హార్టికల్చర్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ప్రత్యక్షంగా 9 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

విశాఖ ప్రాంతీయ ఆర్థిక జోన్‌కి రూ.28,000 కోట్లు
- విశాఖ జోన్ పరిధిలోకి 10 జిల్లాలు
- 9 జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతం

రాయలసీమ గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ కు 30,000 కోట్లు
ప్రతీ జిల్లాకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్
12:44ావీ

**తగ్గిన రెవెన్యూ లోటు..**

2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు
2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.22,002.50 కోట్లు
2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.80,567.47 కోట్లు
2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు

**వివిధ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు :**

వీబీ జీ రామ్ జీ -- రూ.8,365 కోట్లు
గృహనిర్మాణం (పట్టణ-గ్రామీణ) -- రూ.5,451 కోట్లు
డాక్టర్ నందమూరి తారక రామారావు వైద్యసేవ ట్రస్ట్ -- రూ.4,000 కోట్లు
జల జీవన్ మిషన్ -- రూ.4,000 కోట్లు
రీ ప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ -- రూ.2,144 కోట్లు
స్వచ్ఛభారత్ మిషన్ -- రూ.1,037 కోట్లు
నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ -- రూ.955 కోట్లు
ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ -- రూ.838 కోట్లు

**ఏపీ ఆదాయం**

సంక్షేమం -- 17 శాతం
విద్య -- 11 శాతం
ఆర్థికం -- 8 శాతం
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి -- 7 శాతం
వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం -- 6 శాతం
జలవనరులు -- 6 శాతం
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ -- 4 శాతం
విద్యుత్ రంగం -- 4 శాతం
వ్యవసాయం, అనుబంధ రంగాలు -- 4 శాతం
ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు...) -- 15 శాతం
వడ్డీలు, రుణాల చెల్లింపులు -- 18 శాతం
పన్నుల ద్వారా ఆదాయం -- 38 శాతం
పన్నేతర ఆదాయం -- 3 శాతం
బహిరంగ మార్కెట్ రుణాలు -- 30 శాతంకేంద్ర పన్నుల్లో వాటా -- 19 శాతం
గ్రాంట్ ఇన్ ఎయిడ్ -- 10 శాతం

**ఏపీ బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా..**

అమరావతికి -రూ.6వేల కోట్లు.
మున్సిపల్ శాఖ-రూ.14,538.68కోట్లు.
జుహౌ వెల్ఫేర్-రూ.10,699.33కోట్లు.
రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులు-రూ.13,546కోట్లు.
వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు
పోలవరం-రూ.6,105కోట్లు
పీఎం కృషి సించాయి యోజన-రూ.190 కోట్లు
మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు-రూ.9,906 కోట్లు
అన్నదాత సుఖీభవ-రూ.6,600 కోట్లు
మత్స్యకార సేవలో-రూ.260కోట్లు
పంటల బీమా-రూ.250 కోట్లు
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన-రూ.1,927 కోట్లు
ధరల స్థిరీకరణ నిధి-రూ.500 కోట్లు
రాష్ట్ర ఆదాయ నిర్మాణం ఇలా..
ట్యాక్స్ రెవెన్యూ ద్వారా 38 శాతం
కేంద్ర పన్నుల వాటా -- 19 శాతం
గ్రాంట్లు -- 10 శాతం
నాన్ ట్యాక్స్ -- 3 పైసలు
మార్కెట్ అప్పులు, బాధ్యతలు 30 శాతం
రాష్ట్ర పన్ను ఆదాయం -రూ.1,25,846 కోట్లు
కేంద్ర వాటా -- రూ.64,362 కోట్లు
క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ -- రూ. 53,915 కోట్లు
రెవెన్యూ ఎక్స్‌పెండిచర్ -- రూ.2,56,143 కోట్లు
వడ్డీ భారం -- రూ. 37,281 కోట్లు
వడ్డీకి రోజుకు సుమారు రూ.102 కోట్లు
జీఎస్‌డీపీ -- రూ.19,75,073 కోట్లు
వృద్ధిరేటు -- 12.07%

**బడ్జెట్ కేటాయింపులు ఇలా..**

రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు
మూలధన వ్యయం రూ.53,915 కోట్లు.
బడ్జెట్‌ను రూ.3.32 లక్షల కోట్ల అంచనాతో ప్రవేశపెట్టారు
తల్లికి వందనం పథకానికి రూ.9,668 కోట్లు
అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్
రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు
ద్రవ్య లోటు రూ.75,868 కోట్లు
2026-27 వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు
స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రభుత్వ విధానం: పయ్యావుల
ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షకు తగిన విధంగా బడ్జెట్: పయ్యావుల

**బడ్జెట్ కేటాయింపులు ...**

విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు
రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు
పరిశ్రమలకు రూ.3,161 కోట్లు
సర్దుబాటు నిధి.. రూ.1,500 కోట్లు
జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు
వీబీ జీ రామ్ జీకి.. రూ.8365 కోట్లు
గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు
ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4000 కోట్లు
స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు
అమరావతి కోసం రూ.6వేల కోట్లు
అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు
మత్స్యకారులకు రూ.260 కోట్లు
బీసీలకు 23,650 కోట్లు
విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు
9 జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతం
ఉన్నత విద్యకు -- రూ.2,566 కోట్లు
ఉన్నత విద్యకు -- రూ.2,566 కోట్లు
మనబడి మన భవిష్యత్తు-రూ.1,500 కోట్లు
స్కిల్ డెవలప్‌మెంట్ రూ.1,232 కోట్లు
పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా -- రూ.707 కోట్లు

**భవిష్యత్తుకు ఉపయోగపడేలా బడ్జెట్**

బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడేలా రూపొందించామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల అన్నారు. ఇప్పటి వరకు ఏం సాధించాం.. ఇంకా ఏం సాధించాలనే అంశాల ఆధారంగా బడ్జెట్ రూపొందించామన్నారు.

ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ బడ్జెట్‌ను తయారు చేసినట్లు చెప్పారు. కాగితాలకే పరిమితం కాకుండా.. క్షేత్ర స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేయడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించామన్నారు పయ్యావుల.

# కార్యకర్తల నమ్మకమే శక్తిగా నిలిచిన కడప జిల్లా జనసేన

**- ఉమ్మడి కడప జిల్లా జనసేన అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్**
**- జనసేన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం**




**కడప - సూర్య వాస్తవం :** కడప జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన “కడప జిల్లా జనసేన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం” జిల్లా రాజకీయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్ మరియు కడప అసెంబ్లీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు హాజరయ్యారు. కార్యాలయం మొత్తం జనసేన నినాదాలతో, కార్యకర్తల ఉత్సాహంతో ఉప్పొంగిపోయింది. ఈ సమావేశంలో సుంకర శ్రీనివాస్ బాధ్యతాయుతంగా మాట్లాడారు. జనసేన పార్టీ తనకు ఒక హోదా మాత్రమే కాదని, కార్యకర్తల నమ్మకమే తన అసలైన బలం అని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఆవి ర్భావం నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, త్యాగపూరిత నాయకత్వం ప్రేరణగా తీసుకుని కార్యకర్తలు ధైర్యంగా నిలబడి పార్టీ జెండాను భుజాన మోసారని గుర్తు చేశారు. అలాంటి కార్యకర్తల కోసం నిలబడటమే తన బాధ్యత అని, వారి సమస్యలు, వారి భావోద్వేగాలు, వారి ఆశలు అన్నింటినీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను తాను గౌరవంగా స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. జిల్లాలో జనసేన పార్టీని బలంగా నడిపించాలంటే ముందుగా సంస్థాగత బలోపేతం అవసరమని సుంకర శ్రీనివాస్ స్పష్టంగా తెలిపారు. కార్యకర్తకు గౌరవం, గుర్తింపు, భద్రత ఉన్నప్పుడే పార్టీ ప్రజల్లో బలంగా నిలబడుతుందని చెప్పారు. కష్టపడే కార్యకర్తను పక్కన పెట్టే పరిస్థితి జనసేనలో ఎప్పటికీ ఉండదని, న్యాయం, సమానత్వం, గౌరవమే తన నాయకత్వానికి పునాది అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను, అభిప్రాయాలను ఏకస్వరంగా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్యకర్తల సమక్షంలో మూడు కీలక తీర్మానాలను అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ తీర్మానాలను కార్యకర్తలు స్పష్టంగా సుంకర శ్రీనివాస్ కు తెలియజేయగా, వాటిని అధిష్టానం వరకు చేర్చే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.



1. మొదటిగా పార్టీ జిల్లా కమిటీల నుంచి బూత్ కమిటీల వరకు సంస్థాగతంలో బలోపేతం దిశగా అధిష్టానం త్వరితగతిన తగు చర్యలు తీసుకోవాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉన్నప్పుడే జనసేన ప్రజల్లో బలంగా ముందుకు సాగుతుందని, అందుకే కమిటీల పునర్వ్యవస్థీకరణ, క్రియాశీల కార్యకర్తలకు బాధ్యతలు అత్యవసరమని ఈ తీర్మానంలో స్పష్టం చేశారు.

2. రెండవదిగా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ కార్యక్రమాలు, పదవులు, బాధ్యతలలో పొత్తు ధర్మం ప్రకారం జనసేన పార్టీకి తగిన వాటా దక్కాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తూ అందరూ తీర్మానించారు. ఈ వాటా 15 శాతం లేదా 20 శాతం లేదా 30 శాతం అనే అంశాన్ని పూర్తిగా అధిష్టానం నిర్ణయానికి వదిలేస్తూ, కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీకి న్యాయమైన గౌరవం, సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

3. మూడవదిగా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వారికి, వైసీపీ ప్రభుత్వ కాలంలోనూ ఒత్తిళు ్ల, ఇబ్బందులు ఎదురైనా జనసేన జెండాను భుజాన మోసి గట్టిగా నిలబడ్డ వారికి అర్హతలు, అనుభవం మేరకు పార్టీ బాధ్యతలలో, నామినేటెడ్ పదవులలో తగిన న్యాయం చేయాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తూ అందరూ తీర్మానించారు. త్యాగం చేసిన కార్యకర్తకు న్యాయం జరగకపోతే పార్టీ బలహీనమవుతుందని, కార్యకర్తకు న్యాయం జరిగితేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ తీర్మానంలో స్పష్టంగా పేర్కొన్నారు.

ఈ మూడు తీర్మానాలను కార్యకర్తలు సుంకర శ్రీనివాస్ కు తెలియజేయగా, ఆయన స్పందిస్తూ ఈ తీర్మానాలన్నింటినీ సంపూర్ణంగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని, కార్యకర్తల భావోద్వేగాలు, ఆకాంక్షలు ఎక్కడా తగ్గకుండా స్పష్టంగా విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల నమ్మకానికి తగిన విధంగా నిలబడతానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్యకర్తలు వ్యక్తం చేసిన ప్రతి మాట, ప్రతి భావన నా హృదయాన్ని తాకింది. మీరు చెప్పినది కేవలం తీర్మానాలు కాదు,ఇవి కార్యకర్తల ఆశలు, ఆకాంక్షలకు సంకేతాలు అని. జిల్లాలో జనసేన పార్టీకి బలం నేనే కాదు,మీరందరే. మీ నమ్మకమే నా శక్తి, మీ ధైర్యమే నా ధైర్యం” అని అన్నారు. జిల్లా నాయకత్వంగా మీకు నేను ఇచ్చే భరోసా ఒక్కటే -- మీరు ఎవరూ ఒంటరిగా లేరు. కష్టపడే ప్రతి కార్యకర్త నా దృష్టిలో ఉన్నాడు అని, “జనసేన పార్టీ అంటే పదవుల కోసం కాదు,త్యాగం కోసం, న్యాయం కోసం, భవిష్యత్ తరాల కోసం జరిగే ఉద్యమం. ఆ ఉద్యమానికి ప్రాణం పోసింది కార్యకర్తే అని. జిల్లా నాయకుడిగా, ఈ జిల్లాకు బాధ్యత వహిస్తున్న వ్యక్తిగా, మీ ప్రతి సమస్యను నా సమస్యగా తీసుకుని పరిష్కారం దిశగా నడుస్తాను” అని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ కడప జిల్లా జనసేన పార్టీకి సుంకర శ్రీనివాస్ పెద్ద దిక్కుగా ఉన్నారని, అందరినీ కలుపుకుని ముందుకు నడిపిస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గౌరవం ఉందని ప్రశంసించారు. కష్టకాలంలోనూ కార్యకర్తల వెంటే నిలబడి, వారి సమస్యలను తన సమస్యలుగా తీసుకునే నాయకుడు సుంకర శ్రీనివాస్ గారేనని వారు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

మొత్తంగా ఈ విస్తృత స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం కడప జిల్లాలో జనసేన పార్టీ భవిష్యత్ ప్రయాణానికి స్పష్టమైన దిశను చూపిన వేదికగా నిలిచింది. కార్యకర్తల ఆశలు, ఆకాంక్షలు, తీర్మానాలకు ప్రతినిధిగా నిలిచిన ఈ సమావేశం, పవన్ కళ్యాణ్ కు మార్గదర్శకత్వంలో సుంకర శ్రీనివాస్ నాయకత్వాన్ని మరింత బలపరిచిందని, ఆయన నాయకత్వంలో కడప జిల్లా జనసేన పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందనే విశ్వాసాన్ని కలిగించిందని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ కోఆర్డినేటర్ పత్తి విశ్వనాథ్, సీనియర్ నాయకులు చిరంజీవి యువత అధ్యక్షులు పంద్ర రంజిత్ కుమార్, కడప నగర అధ్యక్షులు బొరెడ్డి నాగేంద్ర, జనసేన పార్టీ లీగల్ సేల్ తోట బాలసుబ్రమణ్యం, బొగ్గుల గుర్రప్ప, జనసేన వీర మహిళా రెడ్డి రాణి, కమలాపురం నియోజకవర్గం పిఓసి వేణుగోపాల్ రెడ్డి, గౌస్ లాజం బద్వేల్ నాయకులు మురళి, నందకిషోర్, ఈశ్వర్ రెడ్డి, మైదుకూరు నాయకులు కృష్ణమూర్తి, శ్రీరామ్ వంశీ, జమ్మలమడుగు నాయకులు, నాగార్జున, జగదీష్, ప్రొద్దుటూరు నాయకులు జిల్లాని భాష, సంజీవ, మంచి శివ, పులివెందుల నాయకులు భరత్, దాసర రవి, రమణ, హరి, ఆంజనేయులు, రాజంపేట నాయకులు రామ శ్రీనివాసులు, కోలాటం హరి, కళ్యాణ్ మరియు శేష రాయల్, జిటి కుమార్, అనిల్, శరత్, వెంకటేష్, తరుణ్, చార్లెస్, భరత్ , గోసుల ఆంజనేయులు తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మహిళా సాధికారత - సామాజిక న్యాయానికి బడ్జెట్ బాటలు

- సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ
- ఎస్సీ వర్గాలు, మహిళల సంక్షేమానికి భారీ కేటాయింపులు
- నియోజకవర్గ అభివృద్ధిపై సానుకూల చర్చ





**నాయుడుపేట– సూర్య వాస్తవం:** రాష్ట్ర సమగ్రాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక న్యాయానికి దిక్సూచిలా నిలిచే 2026--27 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర బడ్జెట్ ప్రధానాంశాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ, “ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో రూపొందిన ఈ బడ్జెట్ మహిళా సాధికారతకు, సామాజిక సమానత్వానికి, దళిత బాంధవుల అభ్యున్నతికి బలమైన పునాది వేస్తోంది” అని చెప్పారు.

**ఎస్సీ వర్గాల అభ్యున్నతికి రూ.20,644 కోట్ల కేటాయింపు**

రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ కాంపోనెంట్ కోసం ప్రభుత్వం భారీగా ?20,644 కోట్లను కేటాయించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. దళిత వర్గాల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి ఈ నిధులు దోహదపడతాయని పేర్కొన్నారు.

**హాస్టళ్ల ఆధునీకరణకు రూ.300 కోట్లు**

రాష్ట్రవ్యాప్తంగా 743 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలలను సర్వసౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ?300 కోట్లు కేటాయించడం విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేస్తుందని తెలిపారు. హాస్టళ్లలో మెరుగైన వసతి, భద్రత, విద్యా వాతావరణం కల్పించడం ద్వారా ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

**సొంతింటి భరోసా – అదనంగా రూ.50,000**

గృహ నిర్మాణ పథకం కింద ఎస్సీ లబ్ధిదారులకు అదనంగా ?50,000 ఆర్థిక సాయం అందించడం ద్వారా వారిపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. స్వంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రత, గౌరవం కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**విద్యా ప్రోత్సాహం –పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్**

ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లను నిరంతరాయంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**మహిళా సాధికారతకు ప్రాధాన్యత**

రాష్ట్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి ప్రత్యేక స్థానం కల్పించడంపై ఎమ్మెల్యే విజయశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబులు కావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**స్త్రీ శక్తి పథకం – ఉచిత బస్సు ప్రయాణం**

ఆగస్టు 15, 2025న ప్రారంభమైన స్త్రీ శక్తి పథకం ద్వారా సుమారు 40 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పొందారని వెల్లడించారు. ఈ పథకం మహిళల ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

**తల్లికి వందనం – 67.27 లక్షల మందికి లబ్ధి**

సూపర్ సిక్స్ హామీలో భాగంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఇది విద్యార్థుల చదువుకు, కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు.

**దీపం 2.0 -- 1.08 కోట్ల మహిళలకు లబ్ధి**

దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లను అందిస్తూ, వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. వంట గ్యాస్ ఖర్చు తగ్గించడం ద్వారా మహిళల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతోందని పేర్కొన్నారు.

**వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్**

ఏటా 1 లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతు న్నామని తెలిపారు. ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు దారి తీస్తుందని చెప్పారు.

**అంగన్వాడీల అప్‌గ్రేడ్ – 9,958 కేంద్రాలకు పునర్వైభవం**

రాష్ట్రవ్యాప్తంగా 9,958 అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, కార్యకర్తలు మరియు సహాయకులకు పదవీ విరమణ సమయంలో గ్రాట్యుటీ సౌకర్యాన్ని కల్పించడం అభినందనీయం అని పేర్కొన్నారు.

**మహిళల భద్రత – శక్తి యాప్**

అత్యవసర పరిస్థితుల్లో 7 నిమిషాల్లో రక్షణ అందేలా ‘శక్తి యాప్’ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**సూళ్లూరుపేట అభివృద్ధిపై చర్చ**

ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి ముఖ్యమంత్రి అందిస్తున్న అండదండలు అభినందనీయమని అన్నారు.

**స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కట్టుబాటు**

“పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరవేయడమే మా లక్ష్యం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో మహిళా ప్రజాప్రతినిధులుగా మేము సంపూర్ణ సహకారం అందిస్తాము” అని ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, మహిళా సాధికారత లక్ష్యాలతో రూపొందిన 2026--27 బడ్జెట్ ప్రజల్లో నూతన ఆశలు నింపు తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ఐక్యతసంస్కరణల దీపస్తంభం

# సంత్ సేవాలాల్ మహారాజ్

- డా. ముచ్చుకోట సురేష్ బాబు



**అనంతపురం – సూర్య వాస్తవం :** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ (15 ఫిబ్రవరి 1739 -- 4 డిసెంబర్ 1806) భారతదేశ సామాజిక-ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహనీయుడు. గోర్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక గురువుగా, సంస్కర్తగా, మార్గదర్శకుడిగా నిలిచిన ఆయనను బంజారా ప్రజలు తమ కులదైవంగా, గురువుగా ఆరాధిస్తారు. ఆయన జీవితం బోధనలు దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజలకు నేటికీ స్ఫూర్తి నిస్తున్నారు. బంజారా సంప్రదాయాల ప్రకారం సంత్ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15న జన్మించారు. ఆయన జన్మస్థానం గురించి చారిత్రక వర్ణనల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరి అభిప్రాయం ప్రకారం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో గుత్తి మండలం సమీపంలోని గొల్లలదొడ్డి గ్రామం వద్ద ఉన్న సేవాగడ్‌లో ఆయన జన్మించారు. మరికొందరు కర్ణాటక రాష్ట్రంలోని ?మొగ్గ జిల్లాలోని సురగొండనకొప్ప ఆయన జన్మస్థలంగా పేర్కొంటారు. ఆయన భీమ నాయక్ రామావత్ మరియు ధర్మాణి మాతలకు జన్మించారు. చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక విలువలు సంస్కృతి మూల్యాలు పెరిగారు. బ్రిటిష్ కాలపు వలస పాలన పత్రాల్లో ఆయనను “శివ రాథోడ్”గా పేర్కొనడం ఆయన ప్రభావం ఎంత విస్తృతమైందో సూచిస్తుంది.సంత్ సేవాలాల్ మహారాజ్ జీవించిన కాలం సామాజిక కల్లోలాలతో నిండినది. ఆ సమయంలో అడవివాసులు, సంచార జీవన విధానంలో ఉన్న గిరిజన సమాజాలు అన్యాయాలకు, దోపిడీకి గురయ్యాయి.

ఈ పరిస్థితిని గ్రహించిన ఆయన బంజారా, ఇతర గిరిజన సమాజాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేశారు. దేశమంతటా సంచరిస్తూ మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, హానికర ఆచారాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. జంతు బలులు, దోపిడీ సంప్రదాయాలు, బలవంతపు మత మార్పిడులను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సత్యం, కరుణ, తర్కబద్ధత ఆధారంగా నైతిక జీవనాన్ని ప్రోత్సహించారు.జగదాంబ దేవికి ఆయనకు గాఢ భక్తి ఉన్నప్పటికీ ఆడంబరపూరిత ఆచారాలు, వ్యక్తి పూజలను ఆయన నిరుత్సాహపరిచారు. ఆయన ఆధ్యాత్మికత అంతరంగ పవిత్రత, సామాజిక బాధ్యత, ప్రకృతితో సమన్వయ జీవనాన్ని ప్రధానంగా ప్రోత్సహించింది. మహిళలకు, వృద్ధులకు, సమస్త జీవులకు గౌరవం ఇవ్వాలని ఉపదేశించారు. మద్యపానం, అనైతిక ప్రవర్తన, విభేదాలను విడిచిపెట్టి క్రమశిక్షణ, ధైర్యం, ఐక్యతతో జీవించాలని తన అనుచరులను పిలుపునిచ్చారు.బంజారా సమాజాన్ని పూర్తిగా సంచార జీవన విధానం నుంచి స్థిర నివాసాలైన “తండాలు”లో స్థిరపడేలా మార్గనిర్దేశం చేయడం ఆయన అత్యంత విప్లవాత్మక కృషిగా చెప్పుకోవచ్చు. వ్యవసాయం, స్థిర జీవనం, సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యం ద్వారా సమాజానికి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించే పునాదులను వేశారు. గోర్ బోలి (గోర్ భాష) వంటి తమ సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోవాలని ఆయన ప్రాముఖ్యతనిచ్చారు.లంబాడి భాట్లు “సేవాభాయ” మహాకావ్యాన్ని నేటికీ గానం చేస్తూ ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను వర్ణిస్తారు. సేవాగడ్‌లో జననం, దేవికి సమర్పణలు, న్యాయం కరుణకు ప్రతీకలైన సంఘటనలు, ఆధ్యాత్మిక శక్తిని ప్రతిబింబించే గాథలు బంజారా మౌఖిక సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. ఇవి కేవలం జానపద గాథలు మాత్రమే కాకుండా నైతిక విలువలకు ప్రతీకలుగా నిలుస్తాయి.ఆయన ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో ప్రావీణ్యం కలవారని చెప్పబడింది. అడవివాసులు, గిరిజన సమాజాల్లో సహజ చికిత్సలు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించారు. అడవులను రక్షించాలి, నీటిని సంరక్షించాలి, ప్రకృతితో సమన్వయంగా జీవించాలి అని బోధించారు. ఆయన ప్రతిపాదించిన సేవా సిద్ధాంతాలు సత్యనిష్ఠ, వివక్ష రహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక ఐక్యత మరియు సంఘబలం వంటి విలువలను ప్రతిపాదించాయి.1806 డిసెంబర్ 4న రుహీగఢ్‌లో ఆయన సమాధి పొందారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని వాషిమ్ జిల్లా పోహరాదేవి వద్ద ఉన్న ఆయన సమాధి స్థలం “బంజారా కాశీ”గా ప్రసిద్ధి చెందింది. ఇది నేటికీ ప్రధాన యాత్రాక్షేత్రంగా నిలిచింది. అక్కడ స్థాపించబడిన బంజారా విరాసత్ మ్యూజియం సమాజ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ఆయన చిరస్మరణీయ వారసత్వాన్ని నిలబెడుతోంది.ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతుంది. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక నాయకునికి నివాళి మాత్రమే కాకుండా సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహా సంస్కర్తకు అంకితమైన స్మరణ. అనేక బంజారా గ్రామాలలో ఆయనకు అంకితమైన దేవాల యాలు ఉన్నాయి. జానపద గీతాలు, సంప్రదాయ ఉత్సవాలు ఆయన స్మృతిని తరతరాలకు చేరవేస్తున్నాయి. సంత్ సేవాలాల్ మహారాజ్ వారసత్వం కాలాతీతం. ఆయన ధైర్యవంతమైన సంస్కర్త, తర్కవేత్త, మానవతావాది మరియు ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా గుర్తింపుపొందారు. కరుణ, సాంస్కృతిక గౌరవం, నైతిక విలువలపై ఆధారపడిన నాయకత్వానికి ఆయన జీవితం ఒక శాశ్వత సాక్ష్యం. ఆయన జయంతిని ఆచరించడం ద్వారా దేశం ఒక సమాజ గురువుని మాత్రమే కాకుండా ఐక్యత, పర్యావరణ బాధ్యత నైతిక జీవనానికి మార్గదర్శకుడైన మహనీయుని స్మరిస్తుంది.సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ సామాజిక సమగ్రత, సుస్థిర అభివృద్ధి దిశగా మనలను నడిపించే శాశ్వత దీపస్తంభంగా నిలిచారు. సత్యం, ధైర్యం మానవతా విలువలతో జీవించాలని ఆయన సందేశం తరతరాలకు స్ఫూర్తినిస్తుంది.

# అన్ని అంశాలు నా దృష్టికి వచ్చాయి....

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అనంతపురం అర్బన్ రాజకీయాలపై చర్చలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి భేటీ



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటి అయ్యారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. పార్టీలో కొందరు వ్యవహరిస్తున్న తీరు మీద ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రతి ఒక్కరు పార్టీ లైన్ లో ఉండాలని, అందరూ క్రమశిక్షణగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారన్నారు. మరోవైపు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# గంగమ్మ జాతరకు పోలీసు బందోబస్తు

- సీఐ కృష్ణంరాజు నాయక్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** ఈ నెల 17, 18, 19 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరకు 500 మందికి పైగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ కృష్ణం రాజు నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయం ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.అంతేకాకుండా చాందిని బండ్లకు రవీంద్ర నగర్ నుంచి గంగమ్మ జాతరలోకి చేరుకోవాలని ఆర్టీసీ బస్సులు కూడా అదే రూట్లో చేరుకోవాలన్నారు. లక్కిరెడ్డిపల్లి నుంచి 18వ తేదీ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆర్టీసీ బస్సులకు అనుమతి ఉంటుందని అనంతరం చాందిని బండ్లు వస్తాయని ఆర్టీసీ బస్సులను నిలిపివేసి మర్రిచెట్టు ద్వారా జాతరలోకి పంపిస్తామన్నారు. జాతరలో ఎలాంటి మద్యం జూదం విక్రయించిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేస్తామన్నారు. జాతర ప్రాంగణం అంతా20 సీసీ కెమెరాలు 2 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగ కుండా పార్కింగ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోల్కొండ శోభ పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరలో మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** ఈ నెల 18, 19 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరలో మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నమయ్య జిల్లా డిపి ఈఎస్ మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో మద్యం విక్రయించకుండా ప్రత్యేక బలగా లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎక్సైజ్ శాఖ తరపున ఇద్దరు సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా మద్యంతో పాటు ఎవరైనా నాటుసారా విక్రయించిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఏది ఏమైనా జాతర రెండు రోజులు మద్యం విక్రయించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతు న్నామన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జరగబోవు జాతరలో మద్యానికి చోటు ఇవ్వకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ అలీ హెడ్ కానిస్టేబుల్ గీత సిబ్బంది పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు

### - ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం ప్రెసిడెంట్ అబూబాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామో దరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,అ సోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ పూల మాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ పెన్షన ర్స్ అందరు బ్యాంకు పాస్ బుక్ లో ప్రతి ఒక్కరూ నామినీ పేరు చేయించుకోవాలి. లైఫ్ సర్టిఫికెట్ ఈ నెల చివరి వరకు సమయం ఉన్నది. ఇంకా డి.ఏ లు పెండింగ్ వున్నాయి. వెంటనే ఐ.ఆర్ ప్రకటించాలని చెప్పారు. దామోదరం సంజీవయ్య ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి తొ లి దళిత ముఖ్యమంత్రి. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో,ఆంధ్ర రాష్ట్ర ములో,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో,కేం ద్ర ప్రభుత్వంలో అనేక మార్లు మంత్రి పదవిని నిర్వహించారు. రెండుసా ర్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అ ధ్యక్షుడిగా ఆవడం కూడా ఈయన ప్రత్యేకతల్లో ఒకటి. ఈయన కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షుడు కూడా. 38 సంవత్సరాల పిన్న వయస్సు లో ముఖ్యమంత్రి అయిన ఘనత ఈ యనకే దక్కింది అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, వి.జయలక్ష్మి, శకుంతలమ్మ,కృష్ణ వేణి, దుర్గమ్మ,దేవదాస్, స్వామి దాస్, గో విందు,అస్సన్ అహమ్మద్, గోవింద ప్ప, వెంకట్, సిద్దయ్య, ఆనంతమ్మ, ఫక్రుద్దీన్, చెన్నారెడ్డి, శామ్యూల్, షైక్షా వలి మొదలగు వారు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మహా శివరాత్రి మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీం బ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. శనివారం వీరబ్రహ్మ సుప్రభాతం నామ సంకీర్తన ఉపనిషత్తు పారాయణం మధ్యాహ్నం మఠాధిపతుల మూల పురుషులు శ్రీ పెద్ద గోవింద స్వాముల వారి ప్రథమ పుత్రుడు శ్రీ గోవింద స్వామి వారి ధర్మపత్ని వీర పాపమాంబ వారి ఆరాధన ద్వారపూజ ముఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు నిర్వహించారు. సాయంత్రం హరికథా కాలక్షేపం కలనోత్సవం వచ్చిన భక్తులకు అన్నదానం ప్రత్యేక వసతులు నిర్వహించారు. నేడు ఆదివారం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి వార్షిక కళ్యాణ మహోత్సవము జరుగును ఈ కార్యక్రమానికి భక్తులందరూ పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## పదవి విరమణ పొందిన చిన్ననాటి మిత్రుడుని సన్మానించిన డీసీఎంఎస్ ఛైర్మన్



**డోన్ - సూర్య వాస్తవం :** ఉద్యోగం చేస్తూ పదవి విరమణ పొందిన చిన్ననాటి మిత్రుడు చిట్టూరి శ్రీనివాసరాజుకు శనివారం రోజు వారి స్వగృహం నందు నాగేశ్వరరావు మాట్లాడుతూ సంవత్సరాల కాలం పాటు ఉద్యోగం చేస్తూ సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ చేసిన కాలానికి తీపి గుర్తులుగా మిగిలిపోతాయని కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ఎంజిఎంజిఆర్ఎస్ పనిచేస్తున్న చిట్టూరి శ్రీనివాసరాజు నిరంతర శ్రమయే ఆయుధంగా, నిబద్ధత, క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందా రనిన్నారు. పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతిఒక్కరూ పదవీ విరమణ పొందుతారని, వారి భావిజీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. 31 వతేదీన పదవీ విరమణ చేసిన సి.శ్రీనివాసరాజు నాగేశ్వరరావు సతీసమేతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదింటిలో విరిసిన విద్యా కుసుమం..

- తల్లితండ్రుల కష్టానికి తగ్గ ఫలితం
- విద్యార్థిని కరిష్మాకు ఉన్నతమైన ఉద్యోగ అవకాశం
- కళాశాలకే గౌరవం తెచ్చిన విద్యార్థిని
- విద్యార్థినిని అభినందించిన సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ యాజమాన్యం



**శ్రీ సత్య సాయి బ్యూరో- సూర్య వాస్తవం:** అసలే కటిక పేదరికం రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈ విద్యార్థిని కష్టపడి చదివి ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించి అందరి ద్వారా అభినందనలు పొందుతోంది. ఆ విద్యార్థిని శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన కరిష్మా. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది ఒక మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థిని.. అసలే పేదరికంలో జన్మించిన ఆ విద్యార్థిని చిన్నప్పటి నుంచి విద్య పట్ల ఆసక్తి చూపుతూ బాగా చదువుకుంటూ వచ్చింది. తల్లితండ్రులు కష్టాన్ని చూసిన ఆ విద్యార్థిని చదువు పట్ల మరింత శ్రద్ధ వహించి కష్టపడి చదవడంతో నేడు ఆ విద్యార్థినికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశం దక్కింది. ఇంట్లో తల్లిదండ్రులు, స్కూలు, కళాశాలలో ఉపాధ్యాయులు అధ్యాపకుల ప్రోత్సాహంతో ఆ విద్యార్థిని ప్రస్తుతం ఉన్నత స్థాయికి ఎదగడం అందరిని ఆనందపరిచేస్తోంది. సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ యాజమాన్యం కూడా విద్యార్థినికి మంచి ప్రోత్సాహం ఇవ్వడంతో ఉన్నత స్థాయికి చేరుకుంది. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన షేక్ కరిష్మా పుట్టపర్తి సమీపంలోని బీ దుపల్లి లో ఉన్న సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.. సంస్కృతి కళాశాల ఆస్ట్రియా దేశానికి చెందిన రైస్ సంస్థతో కలిసి నిర్వహిస్తున్న రైట్ ప్రోగ్రామ్ ద్వారా ప్రతి ఆరు నెలలకు ఒక విదేశీ ఫ్యాకల్టీ క్యాంపస్‌కు వచ్చి విద్యార్థులకు శిక్షణ అందిస్తుండగా, ఈ ప్రోగ్రామ్‌లో మొదటి సంవత్సరం నుంచే ఎంపికైన కరీష్మ నాలుగు సంవత్సరాల పాటు నాలుగు మాడ్యూళ్లను విజయవంతంగా పూర్తి చేసి కోడింగ్‌లో మొదటి స్థానాన్ని సాధించింది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా రైస్ ఆస్ట్రియా సంస్థలో ఇంటర్న్‌షిప్‌తో పాటు రూ.19,60,000 వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ ఆఫర్ లభించింది. వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కరీష్మ తండ్రి రోజువారీ కూలీగా, తల్లి టైలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు; నలుగురు అక్కచెల్లెళ్లలో ఒకరైన ఆమె ప్రభుత్వ పాఠశాలలో చదువు పూర్తి చేసి కష్టపడి ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో ప్రేరణాత్మకం. ఈ ఘనతతో కరీష్మ కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేయగా, సంస్కృతి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రస్తుతం ఇలాంటి రైట్ అంతర్జాతీయ ప్రోగ్రామ్ అవకాశం మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతి కళాశాలకే ప్రత్యేకం కావడం గర్వకారణమని కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తప్పిన పెను ప్రమాదం

### - అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**కనేకల్ - సూర్య వాస్తవం :** కనేకల్ పట్టణంలోని దిగువ గేరి ప్రాంతంలో శనివారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత విద్యుత్ స్తంభలు ఒక్క సారిగా కూలిపడి సమీపంలోని ఓ నివాస గృహంపై ఒక స్తంభం పడింది. అదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రిక్షా కూడా అక్కడి గుండా ప్రయాణిస్తుండగా, క్షణాల్లో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం, సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గట్టిగా శబ్దం వినిపించడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. విద్యుత్ స్తంభం ఇంటి పైకప్పును దెబ్బతీయడంతో పైకప్పు షీట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు కూడా భయంతో వణికిపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ విద్యుత్ స్తంభం గత కొంతకాలంగా వంగి ప్రమాదకర స్థితిలో ఉందని, గాలివానల సమయంలో మరింత ప్రమాదం సంభవించే అవకాశముందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితేనే అధికారులు స్పంది స్తారా?" అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఘటన అనంతరం సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కూలిన స్తంభాన్ని తొలగించి తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను తొలగించారు. ఈరోజు దిగువగేరి అంధకారంలో ఉన్నట్టు సమా చారం. అయితే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని, పట్టణంలోని ఇతర ప్రమాదకర స్తంభాలను కూడా తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో పట్టణ ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం చెర్లోపల్లి గ్రామా సమీపన సేవాగడ్‌లో జరుగు తున్న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో భాగంగా కార్య క్రమానికి విచ్చేసిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవి కుమార్. ఈ సందర్భంగా వారు గుత్తి మున్సి పల్ సిబ్బంది, వర్కర్ల ద్వారా చే యిస్తున్న శానిటేషన్ పనులు ప్లాస్టిక్ బ్యాన్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టడమైందని గుత్తి మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాష, శానిటేషన్ సెక్రెటరీలు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.






## ఘనంగా విద్యానికేతన్ పాఠశాల 25వ వార్షికోత్సవం

**కనేకల్ - సూర్య వాస్తవం :** కనేకల్ క్రాస్ ప్రాంతంలో ఉన్న శ్రీ విద్యానికేతన్ పాఠశాల 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. స్కూల్ కరస్పాండెంట్ రవి కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు రంగస్థలంలో సాంస్కృతిక వేషధారణలతో ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు చేశారు. సంప్రదాయ శైలీతో పాటు ఆధునిక అంశాలను కలిపి రూపొందించిన డ్యాన్స్ ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులుగా చేశాయి. కరస్పాండెంట్ రవికుమార్ మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుకు శ్రీ విద్యానికేతన్ స్కూల్ పునాది రాయిగా నిలుస్తోంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సహకారంతో స్కూల్ విజయవంతంగా 25 సంవత్సరాలు కొనసాగింది. ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థుల తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమని" అన్నారు. వేదికకు ముఖ్య అతిథిగా రాయదుర్గం ఎమ్మెల్యే కుమారుడు కాలవ భరత్ హాజరయ్యారు. వేడుకలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ 25వ వార్షికోత్సవ వేడుక ద్వారా శ్రీ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించడమే కాక, సమాజానికి సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి ఒక స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## తిమ్మమాంబ ఉత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు



**కదిరి - సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మమ్మ మర్రిమాను జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కదిరి ఆర్టీసీ డిఎం రామకృష్ణ తెలిపారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ తిమ్మమ్మ మర్రిమాను మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కదిరి డిపో నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు మహా శివరాత్రి సందర్భంగా నంబులపూలకుంట మండలం గుటి బైలు గ్రామం వద్ద జరిగే తిమ్మమ్మ మర్రిమాను జాతరకు శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆరు డిపోల నుండి 12 బస్సులు కొక్కంటి క్రాస్, రెక్కమాను నుండి ప్రతి 10 నిమిషాలకు నడుపుతున్నామన్నారు. కదిరి బస్టాండ్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక ప్రత్యేక బస్సు నడుపుతున్నామని పేర్కొన్నారు. ఈ బస్సులో శ్రీ శక్తి పథకం వర్తిస్తుందని కూడా తెలియజేశారు. 15న ఆదివారం జరిగే జాగరణకు 16 సోమవారం జరిగే ముక్కుబడులు పూజలకు కదిరి డిపో నుండి ప్రత్యేక బస్సులను కదిరి బస్టాండ్ నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 10 బస్సులను గాండ్లపెంట రెక్క మాను మీదుగా నడుపుతున్నామని వివరించారు. కదిరి బస్టాండ్, జీవి మాను సర్కిల్,రెక్కమాను, కొక్కంటి క్రాస్ వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి ప్రయా ణికులకు వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ అవకాశాని కదిరి ప్రాంత భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిఎం విజ్ఞప్తి చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )